News Daily

ఎడిటర్ :

B. ఉపేందర్

cknews7484@gmail.com

Visit in :
www.cknewstv.in

CK
చంద్ర కాంత్


NEWS

తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :272 | ఖమ్మం | మంగళవారం, నవంబర్ 3, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



దీపావళికి గ్రీన్ క్రాకర్స్‌కు
సుప్రీంకోర్టు ఓకే!

- నవంబర్ 7, 8 తేదీల్లోనే అనుమతి.. రోజుకు రెండు గంటలు మాత్రమే
- ఉదయం 6-7 గంటలు.. రాత్రి 8-10 గంటల వరకు అవకాశం
- ఆస్పత్రులు, విద్యాసంస్థల పరిసరాల్లో 300 మీటర్ల వరకు నిషేధం
- నవంబర్ 9 నుంచి మళ్లీ పూర్తి స్థాయి నిషేధం



భారత వైమానిక దళానికి
కొత్త అధిపతి

- 29వ చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్
- ఎయిర్ చీఫ్ మార్షల్‌గా బాధ్యతల స్వీకరణ
- ఏపీ సింగ్ స్థానంలో నియామకం
- నాలుగు దశాబ్దాల సైనిక సేవ.. 3,300 గంటలకు పైగా విమానయాన అనుభవం
- ఆపరేషన్ సింధూర్‌లోనూ కీలక బాధ్యతలు

తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు చరమగీతం



కదంతొక్కిన కాషాయ శ్రేణులు

- త్రివర్ణ పతాకం చేతబూని హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..
- 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' నినాదంతో బీజేపీ ర్యాలీ
- బషీర్‌బాగ్ నుంచి మొజాంజాహీ మార్కెట్ వరకు 1.5 కిలోమీటర్ల మేర పాదయాత్ర
- పాదయాత్రకు ముందు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో అమిత్ షా ప్రత్యేక పూజలు

- తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు నూకలు చెల్లినట్టే.. తరిమికొట్టాలి
- భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు
- బేగంపేట నుంచి చార్మినార్ వరకు కేంద్ర హోంమంత్రికి ఘన స్వాగతం
- 'లోకతంత్ర బచావో-అరాచకత హటావో' నినాదంతో బీజేపీ మహా పాదయాత్ర
- ఆరు గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం: షా
- తెలంగాణను ఏటీఎంగా మార్చుకుని ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపణ
- రేవంత్ ద్వారా రాహుల్‌కు డబ్బులు వెళ్తున్నాయని వ్యాఖ్యలు



హైదరాబాద్

తెలంగాణలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. - మిగతా 3లో



రోడ్డు పనుల్లో పెను విషాదం..

- విద్యుదాఘాతంతో 8 మంది కార్మికులు మృతి!
- 11 వేల వోల్టుల విద్యుత్ తీగలకు తగిలిన నిర్మాణ యంత్రం
- రాజస్థాన్‌లోని ఝుంఝునూ జిల్లాలో ఘోర ప్రమాదం
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని సీఎం భరోసా
- ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశాలు

విద్యుత్ సిబ్బందికి దీపావళి కానుక

- 2.543 శాతం డీఏ పెంపు!
- తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంపు.. 71,360 మందికి ప్రయోజనం!
- 2.543 శాతం పెరిగిన కరువు భత్యం, కరువు సాయం
- 19.272 శాతం నుంచి 21.815 శాతానికి డీఏ పెంపు
- 2026 జూలై 1 నుంచి అమలు.. ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు లబ్ధి
- విద్యుత్ సంస్థలపై నెలకు రూ.14.63 కోట్ల అదనపు భారం



హైదరాబాద్

తెలంగాణ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుక అందించింది. నాలుగు ప్రభుత్వ విద్యుత్ సంస్థల పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి కరువు భత్యం (డీఏ), పెన్షనర్లకు కరువు ఉపశమనం (డీఆర్) పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డీఏను 2.543 శాతం పెంచడంతో ఇప్పటివరకు ఉన్న 19.272 శాతం నుంచి 21.815 శాతానికి చేరింది. 2026 జూలై 1వ తేదీ నుంచి ఈ పెంపు - మిగతా 3లో

బీజేపీ ప్రచారం బూమరాంగ్.. దిల్లీలో యథావిధిగా మార్కెట్లు!



- ఇండియా కూటమి ర్యాలీతో వ్యాపారాలకు నష్టం లేదన్న కాంగ్రెస్
- దుకాణాలు తెరిచే ఉన్నాయి.. కొనసాగిన కొనుగోళ్లు
- బీజేపీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టారు: జైరాం రమేశ్
- స్థానిక వ్యాపారులకు అండగా నిలవాలని రాహుల్ పిలుపు

ట్రాఫిక్ ఫ్రీ నగరమే లక్ష్యం!

నగర పరిశుభ్రత, ట్రాఫిక్ నియంత్రణపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



- హైదరాబాద్‌ను క్లీన్ అండ్ ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలి: సీఎం రేవంత్
- ఇంటింటికీ రోజూ చెత్త సేకరణ.. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- 19 ఎస్టీపీల నుంచి 28 గ్రీన్ ట్యాంకర్లతో శుద్ధి చేసిన నీటి సరఫరా
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల ప్రణాళిక
- హైదరాబాద్ ఇక క్లీన్ అండ్ ట్రాఫిక్ ఫ్రీ సిటీ!
- చెత్త కనిపించకూడదు.. ట్రాఫిక్ నిలిచిపోకూడదు
- గ్రీన్ వాటర్ ట్యాంకర్ల సరఫరా విస్తరణకు సీఎం రేవంత్ ఆదేశాలు
- సిగ్నల్ ఫ్రీ జంక్షన్లకు అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల ప్రణాళిక

హైదరాబాద్

హైదరాబాద్ మహానగరాన్ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడా చెత్త కనిపించకూడదని, ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నగర పరిశుభ్రత, గ్రీన్ వాటర్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ తదితర - మిగతా 3లో



ఎస్ఐఆర్ దెబ్బ..
ఐదు రాష్ట్రాల్లో 2.28 కోట్ల ఓట్లు మాయం!

- ఓటరు జాబితాల సవరణతో భారీగా తగ్గిన ఓటర్ల సంఖ్య
- ఐదు రాష్ట్రాల్లో 18.71 కోట్ల నుంచి 16.43 కోట్లకు తగ్గుదల
- ఉత్తరప్రదేశ్‌లోనే 2.04 కోట్ల ఓటర్లకు కోత
- అర్హులైన వారికి మరో అవకాశం కల్పిస్తామన్న ఈసీ

రైతులను ఆదుకోవడంలో రేవంత్ సర్కార్ విఫలం

- పాలమూరులో కరువు పరిస్థితులకు కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణమని విమర్శ
- కృష్ణా జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో వైఫల్యం
- కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 50 టీఎంసీలకు బదులు 18 టీఎంసీలే ఎత్తిపోతలు
- పంట నష్టపోయిన రైతులకు పరిహారం.. యాసంగి రైతుబంధు చెల్లించాలని డిమాండ్

వనపర్తి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. పాలమూరు ప్రాంతంలో నెలకొన్న కరువు పరిస్థితులకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. శ్రీశైలం, జూరాల ప్రాజెక్టుల నుంచి అందుబాటులో ఉన్న కృష్ణా జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో - మిగతా 3లో

ట్రాఫిక్ ఫ్రీ నగరమే లక్ష్యం!

-మొదటిపేజీ తరువాయి

అంశాలపై సీఎం చర్చించారు.

రోజూ ఇంటింటికీ చెత్త సేకరణ

నగరంలో చెత్త నిర్వహణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజూ చెత్త సేకరణ జరిగేలా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. చెత్త సేకరణ వాహనాలు నిర్ణీత సమయాల్లో ప్రతి ప్రాంతానికి చేరుకునేలా చూడాలని, ఎక్కడైనా చెత్త పేరుకుపోతే వెంటనే తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బంది బాధ్యతగా పనిచేసేలా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు

నగరంలో భవన నిర్మాణాలు, రోడ్ల పనుల నుంచి వెలువడే వ్యర్థాలు రహదారులపై పేరుకుపోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. నిర్మాణ వ్యర్థాలను సేకరించి నిర్ణీత ప్రాంతాలకు తరలించే విధంగా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లోనూ చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా ఇండస్ట్రియల్ ఏరియా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పారిశ్రామిక వాడల్లో వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

తాగునీటి వినియోగానికి బదులుగా గ్రీన్ వాటర్

నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, గార్డెనింగ్, ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం పెంపు వంటి అవసరాలకు తాగునీటిని వినియోగించడం తగ్గించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో (ఎస్టీపీ) శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని ఆదేశించారు. తద్వారా తాగునీటిని ఆదా చేయడంతో పాటు శుద్ధి చేసిన నీటిని తిరిగి ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రీన్ వాటర్ ట్యాంకర్ల సేవలను



విస్తృతంగా వినియోగించుకునేలా ప్రజలు, నిర్మాణ సంస్థలు, వాణిజ్య సంస్థల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. తాగునీటికి బదులుగా శుద్ధి చేసిన నీటిని ఉపయోగించేలా ప్రోత్సహించాలన్నారు.

19 ఎస్టీపీల నుంచి 28 గ్రీన్ ట్యాంకర్లు

జలమండలి ఇప్పటికే తొలి విడతలో 19 మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ సేవలను మరింత విస్తరించాలని సీఎం ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధితో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధుల్లోనూ గ్రీన్ వాటర్ సరఫరా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, పచ్చదనం అభివృద్ధి పనులు, నిర్మాణ రంగం వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటిని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ నీటిని తాగడానికి ఉపయోగించరాదనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తూ సరఫరా నిర్వహణ చేపట్టాలని సూచించారు.

ట్రాఫిక్ జామ్‌లకు చెక్ పెట్టాలి

హైదరాబాద్‌లో పెరుగుతున్న వాహనాల రద్దీ, ట్రాఫిక్ సమస్యలపై సీఎం ప్రత్యేకంగా సమీక్షించారు. నగరంలో వాహనదారులు ఎక్కువసేపు ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రధాన రహదారులు, రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల రాకపోకలు సాధ్యమైనంత వరకు నిరంతరాయంగా సాగేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లపై దృష్టి

సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్లలో పరిస్థితులకు అనుగుణంగా అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు, రహదారుల విస్తీర్ణం, ట్రాఫిక్ రద్దీని పరిశీలించి తగిన ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ట్రాఫిక్ నిర్వహణలో ఆధునిక విధానాలను అనుసరిస్తూ నగర ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు.

సమావేశంలో ఉన్నతాధికారులు

ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జి. సృజన తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో రేవంత్ సర్కార్ విఫలం

-మొదటిపేజీ తరువాయి

వైఫల్యం పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. శ్రీశైలం, జూరాల ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని సకాలంలో వినియోగించుకుంటే రైతులకు కొంతమేర ఉపశమనం కలిగేదని పేర్కొన్నారు. కృష్ణా నీటిని ఎత్తిపోసే విషయంలో ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లే పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు ప్రాంతంలో సాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇచ్చామని, వరుసగా ఎనిమిదేళ్ల పాటు కొన్ని ప్రాంతాల్లో రెండు పంటలు సాగయ్యాయని గుర్తుచేశారు. ప్రస్తుతం సాగునీరు అందక రైతులు పెట్టుబడులు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

కల్వకుర్తి ఎత్తిపోతలపై ప్రభుత్వాన్ని నిలదీత

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా గతంలో 50 టీఎంసీల నీటిని ఎత్తిపోసినట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని విమర్శించారు. సాగునీటి అవసరాలు ఉన్న సమయంలో నీటిని ఎత్తిపోసి పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. శ్రీశైలం, జూరాల నుంచి వెంటనే నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్



చేశారు.

రైతులకు పరిహారం.. రైతుబంధు చెల్లించాలి

కరువు, నీటి కొరత కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని హరీశ్‌రావు కోరారు. పంట నష్టంపై సమగ్రంగా అంచనా వేసి బాధిత రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. యాసంగి పంట సాగుకు అవసరమైన పెట్టుబడి సాయం రైతుబంధును వెంటనే విడుదల చేయాలని కోరారు. రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమవుతోందని విమర్శించారు.

కరువు మండలాల ప్రకటనతో సరిపెట్టొద్దు

రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించడంతోనే బాధ్యత ముగిసినట్లు భావించకూడదని హరీశ్‌రావు అన్నారు. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించి రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. పాలమూరు ప్రాంతంలో నెలకొన్న కరువు పరిస్థితులను అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక బృందాన్ని పంపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బృందం పర్యటించి పంట నష్టం, సాగునీటి కొరత, రైతుల ఇబ్బందులను పరిశీలించాలని కోరారు.

రైతులకు అండగా ఉంటాం

కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజలకు భరోసా ఇవ్వడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు కూడా రైతుల సాగుపై ప్రభావం చూపుతున్నాయని విమర్శించారు. ప్రజల సంక్షేమం, రైతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వ్యాఖ్యానించారు. కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు అండగా నిలిచేందుకే తాము గ్రామాల్లో పర్యటిస్తున్నామని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

విద్యుత్ సిబ్బందికి దీపావళి కానుక

-మొదటిపేజీ తరువాయి

అమల్లోకి రానుంది. దీంతో జూలై నుంచి పెరిగిన డీఏకు సంబంధించిన బకాయిలు కూడా లబ్ధిదారులకు అందనున్నాయి. విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.

71,360 మందికి ప్రయోజనం

ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ సంస్థల పరిధిలో మొత్తం 71,360 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రయోజనం కలగనుంది. పెరిగిన డీఏ, డీఆర్ కారణంగా విద్యుత్ సంస్థలపై నెలకు సుమారు రూ. 14.63 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా కొంత ఊరట కల్పించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఆరు నెలలకోసారి డీఏ సవరణ

కేంద్ర కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో ప్రకటించే అఖిల భారత వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా కరువు భత్యం, కరువు ఉపశమనాన్ని సాధారణంగా ప్రతి ఆరు నెలలకోసారి సవరిస్తుంటారు. జనవరి, జూలై నెలలను ప్రాతిపదికగా తీసుకుని ఈ మార్పులు చేపడతారు. తాజాగా ధరల సూచీకి అనుగుణంగా విద్యుత్ సంస్థల ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ట్రాన్స్‌కోలో 9,194 మందికి లబ్ధి

తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (టీజీ ట్రాన్స్‌కో) పరిధిలో మొత్తం 9,194 మందికి ప్రయోజనం చేకూరనుంది. వీరిలో 3,081 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 3,644 మంది ఆర్టిజన్లు, 2,469 మంది పెన్షనర్లు ఉన్నారు.

జెన్‌కోలో 14,167 మందికి ప్రయోజనం

తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టీజీ జెన్‌కో) పరిధిలో 7,197 మంది ఉద్యోగులు, 3,544 మంది ఆర్టిజన్లు, 3,426 మంది పెన్షనర్లు ఉన్నారు. మొత్తంగా 14,167 మందికి డీఏ, డీఆర్ పెంపు వల్ల ప్రయోజనం కలగనుంది.



ఎస్పీడీసీఎల్‌లో అత్యధిక లబ్ధిదారులు

తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీ ఎస్పీడీసీఎల్) పరిధిలో అత్యధికంగా 28,481 మంది లబ్ధి పొందనున్నారు. వీరిలో 11,719 మంది ఉద్యోగులు, 8,493 మంది ఆర్టిజన్లు, 8,269 మంది పెన్షనర్లు ఉన్నారు.

ఎన్పీడీసీఎల్‌లో 19,518 మందికి లబ్ధి

తెలంగాణ ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీ ఎన్పీడీసీఎల్) పరిధిలో 9,936 మంది ఉద్యోగులు, 3,435 మంది ఆర్టిజన్లు, 6,147 మంది పెన్షనర్లు ఉన్నారు. మొత్తం 19,518 మందికి పెరిగిన డీఏ, డీఆర్ వర్తించనుంది.

విద్యుత్ రంగ భవిష్యత్తుపైనా దృష్టి

ఉద్యోగుల సంక్షేమంతో పాటు రాష్ట్ర విద్యుత్ రంగాన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాబోయే పదేళ్లలో తెలంగాణలో విద్యుత్ డిమాండ్ ఎంత మేర పెరిగే అవకాశం ఉందో ముందుగానే అంచనా వేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలిక విద్యుత్ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యుత్ గ్రిడ్‌లను ఆధునీకరించడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యుత్ అంతరాయాలను తగ్గించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తూనే ఉద్యోగుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

దీపావళికి ముందే ప్రకటన

దీపావళి పండుగకు ముందు ప్రభుత్వం తీసుకున్న డీఏ పెంపు నిర్ణయం విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ఆర్థికంగా కొంత ఊరటనివ్వనుంది. ముఖ్యంగా జూలై 1 నుంచి పెంపు అమలు కానుండటంతో అప్పటి నుంచి రావాల్సిన బకాయిలు కూడా అందనున్నాయి. మొత్తం 71,360 కుటుంబాలకు ఈ నిర్ణయం ద్వారా ప్రయోజనం కలగనుంది.

తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు చరమగీతం

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణను ఏటీఎంగా మార్చుకుని 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో వసూళ్లకు పాల్పడుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వారా రాహుల్ గాంధీకి ఈ డబ్బులు వెళ్తున్నాయని ఆరోపణలు చేశారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయిందని, ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉందని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ వల్ల కాంగ్రెస్ పార్టీని కాపాడటం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో బీజేపీ నిర్వహించిన మహా పాదయాత్ర ముగింపు సభలో అమిత్ షా ప్రసంగించారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

తెలంగాణ పర్యటనలో భాగంగా సోమవారం మధ్యాహ్నం అమిత్ షా బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, ఇతర పార్టీ ముఖ్య నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు, ఎంపీ రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లోకతంత్ర బచావో.. అరాచకత హటావో

'లోకతంత్ర బచావో-అరాచకత హటావో' (ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం-అరాచకత్వాన్ని అంతం చేద్దాం) నినాదంతో తెలంగాణ బీజేపీ ఈ మహా పాదయాత్రను నిర్వహించింది. బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి యాత్ర ప్రారంభమైంది. అబిడ్స్ మీదుగా మోజంజాహీ మార్కెట్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మోజంజాహీ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు.

ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి?

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని అమిత్ షా విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని, తెలంగాణలో మాత్రం ఆరు గ్యారెంటీలు అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. మోదీ ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారని, ఆయన ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు లేవని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు.

ఈవీఎంలపై కాంగ్రెస్ విమర్శలకు కౌంటర్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలను అమిత్ షా తప్పుబట్టారు. ఈవీఎంల ద్వారానే ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయన్నది కాంగ్రెస్ వాదన అయితే, అదే ఈవీఎంలతో తెలంగాణలో కాంగ్రెస్ ఎలా విజయం సాధించిందని ప్రశ్నించారు. కేరళం, హిమాచల్‌ప్రదేశ్‌లో ఆ పార్టీ విజయాలు ఎలా సాధ్యమయ్యాయని నిలదీశారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పుడల్లా ఈవీఎంలను తప్పుబట్టడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు.

కాంగ్రెస్ పతనం ఖాయం.. తెలంగాణలో బీజేపీదే అధికారం

దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజాదరణ కోల్పోయి అధికారానికి దూరమవుతోందని అమిత్ షా వ్యాఖ్యానించారు. పార్టీని కాపాడటం రాహుల్ గాంధీ వల్ల కాదని ఎద్దేవా చేశారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, వచ్చే రోజుల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఎస్ఐఆర్‌పై విపక్షాల ఆరోపణలకు ప్రతిగా పాదయాత్ర

దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న విమర్శలకు సమాధానంగా ఈ పాదయాత్రను బీజేపీ నిర్వహించింది. ఢిల్లీలో ఇండియా కూటమి నేతలు నిర్వహించిన 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి ప్రతిగా ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టడంతో పాటు కాంగ్రెస్ రాజకీయ వైఖరిని ప్రజల్లో ఎండగట్టడమే లక్ష్యంగా బీజేపీ నేతలు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పాదయాత్ర తరహా కార్యక్రమాలను దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ చేపట్టేందుకు పార్టీ ప్రణాళిక రూపొందించింది.

కదంతొక్కిన కాషాయ శ్రేణులు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో మహా పాదయాత్ర చేపట్టారు. 'ఇండియా' కూటమి చేపట్టిన ప్రచారాన్ని తిప్పికొట్టే లక్ష్యంతో బీజేపీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ పాదయాత్ర సాగింది. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' అనే నినాదంతో ఈ ర్యాలీని నిర్వహించారు. నగరంలోని బషీర్‌బాగ్‌లో ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఈ పాదయాత్ర ప్రారంభమైంది. జాతీయ జెండా చేతబూని అమిత్ షా ముందుకు సాగగా, ఆయనతో పాటు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. సుమారు 1.5 కిలోమీటర్ల మేర సాగే ఈ పాదయాత్ర మొజాంజాహీ మార్కెట్ వద్ద ముగియనుంది. అక్కడ జరిగే కార్నర్ మీటింగ్‌లో అమిత్ షా ప్రసంగించనున్నారు. ఢిల్లీలో ఆదివారం 'ఇండియా' కూటమి నిర్వహించిన ర్యాలీలో బీజేపీపై చేసిన విమర్శలకు ఆయన ఇక్కడ దీటైన సమాధానం ఇచ్చే అవకాశం ఉంది. పాదయాత్రకు ముందు, కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని అమిత్ షా సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. "వరుస ఓటములతో కుంగిపోయిన కాంగ్రెస్, ఇప్పుడు అరాచక చర్యలతో ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి అయినా సరే అధికారాన్ని దక్కించుకోవాలని చూస్తోంది. కాంగ్రెస్ కుట్రపూరిత ప్రయత్నాల నుంచి మన ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ఈ మహా పాదయాత్రలో పాల్గొంటున్నాను" అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. నగర పర్యటనలో భాగంగా, తొలుత అమిత్ షా చారిత్రక చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఇతర బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర నేపథ్యంలో బషీర్‌బాగ్, నాంపల్లి, అబిడ్స్, కోఠి, అఫ్జల్‌గంజ్ సహా పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించి, వాహనాలను దారి మళ్లించారు.

రెవెన్యూ-అటవీ భూ వివాదాలపై జాయింట్ సర్వే.. నేనే పర్యవేక్షిస్తా: పొంగులేటి

హైదరాబాద్: రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ వివాదాల కారణంగా రైతులు, సామాన్య ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖల సంయుక్త సర్వే ప్రక్రియను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. సచివాలయంలో రెవెన్యూ, అటవీ, సర్వే అండ్ సెటిల్‌మెంట్ విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి ఈ మేరకు దిశానిర్దేశం చేశారు.

దశాబ్దాల వివాదాలకు తెరదించాలి

రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ భూముల మధ్య సరిహద్దులపై చాలా కాలంగా వివాదాలు కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో అటవీ భూములు అధికంగా ఉన్న నేపథ్యంలో ఈ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. పట్టా భూములు, రెవెన్యూ భూములు, అటవీ భూముల మధ్య ఉన్న సరిహద్దు వివాదాలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

జాయింట్ సర్వేతో స్పష్టమైన హద్దులు

రెండు శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి భూముల వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని పొంగులేటి ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సర్వే పద్ధతులను ఉపయోగించి భూముల హద్దులను కచ్చితంగా గుర్తించాలని సూచించారు.

ఫిర్యాదు చేసిన వెంటనే స్పందన.. విద్యుత్ తీగల సమస్యకు పరిష్కారం

- ఏఈ ఉమాకాంత్ ఆదేశాలతో తక్షణ చర్యలు..
- వర్షాల నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం



సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ నవంబర్ 02 2026: ఏన్కూరు మండల పరిధిలోని ప్రధాన సెంటర్‌లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యపై విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారం చూపించారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటంతో దుకాణదారులు, అటుగా రాకపోకలు సాగించే ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని గుర్తించిన స్థానిక దుకాణదారులు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన ఏఈ ఉమాకాంత్ వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు శ్రీను, రమేష్, వేణు ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టి పనులను త్వరితగతిన పూర్తి చేశారు. దీంతో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యకు పరిష్కారం లభించింది. స్థానికంగా కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో అవి విద్యుత్ తీగలపై వేలాడుతూ వెళ్లడం వల్ల తీగలు సాగి కిందకు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. సమస్యను గుర్తించిన వెంటనే అధికారులు స్పందించి చర్యలు చేపట్టడంతో దుకాణదారులు హర్షం వ్యక్తం చేశారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తత అవసరం

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. తడిగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలు, కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలి. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, తీగల సమీపంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడినా, కిందకు వేలాడుతున్నా వాటిని తాకకుండా వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలి. సొంతంగా తీగలను సరిచేసేందుకు ప్రయత్నించకూడదు.విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండటంతోపాటు, సమస్యలు గుర్తించిన వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచిస్తున్నారు. ఏన్కూరు ప్రధాన సెంటర్‌లో విద్యుత్ తీగల సమస్యపై సత్వరమే స్పందించి పరిష్కరించిన ఏఈ ఉమాకాంత్‌తో పాటు విద్యుత్ సిబ్బందిని స్థానిక దుకాణదారులు అభినందించారు.

ప్రభుత్వ దవాఖానాకు సిరంజీల అందజేత


- ఏన్కూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు నవంబర్ 02 2026: ఏన్కూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ దవాఖానాకు సిరంజీలను అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులకు అవసరమైన వైద్య పరికరాల అందుబాటుకు తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ప్రెస్ క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ప్రభుత్వ దవాఖానకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమాజంలో ప్రజలకు సమాచారాన్ని అందించే బాధ్యతతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాత్ర పోషించాలనే లక్ష్యంతో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సిరంజీలను అందజేసినట్లు తెలిపారు.
ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మరింత మెరుగుపడేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. భవిష్యత్తులోనూజూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రెస్ క్లబ్ కృషి చేస్తుందని పేర్కొన్నారు.
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా, అవసరమైన సందర్భాల్లో సమాజానికి అండగా నిలవడం కూడా పాత్రికేయుల సామాజిక బాధ్యతలో భాగమని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

భౌతికకాయానికి నివాళులర్పించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

బాసు హనుమంతు నాయుడు



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :ఈరోజు గద్వాల నియోజకవర్గం గట్టు మండలం బస్వాపురం గ్రామంలో దాసరి హనుమంతు అనారోగ్యంతో మృతి చెందాడు.... విషయం తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్లి, ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.....
వీరి వెంట,గ్రామ ఉప సర్పంచు అంజి,రాజు నాయుడు,లోకేష్, తిరుమల్,తిమ్మారెడ్డి, రాముడు,మహేష్, కృష్ణ, మహేందర్, మరియు నాయకులు తదితరులు ఉన్నారు....

పదేళ్ల పాలనకు లెక్కలేవి? ఆదిలాబాద్ అభివృద్ధిపై బీఆర్ఎస్ శ్వేతపత్రం విడుదల చేయాలి

- రైతు గర్జన వేదికగా రాజకీయ విమర్శలు కాదు గత పాలనలో జిల్లాకు చేసిన అభివృద్ధి వివరాలు వెల్లడించాలి
- ప్రజా ప్రభుత్వ హయాంలో విమానాశ్రయం, పారిశ్రామిక పార్కుతో ఆదిలాబాద్‌కు కొత్త దిశ బోథ్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత
- బోథ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆలపాటి అచ్యుతానంద్ రెడ్డి



సికె.న్యూస్. ప్రతినిధి అదిలాబాద్:రైతు గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై బోథ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆలపాటి అచ్యుతానంద్ రెడ్డి స్పందించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా రైతులు, నిరుద్యోగ యువత, సాగునీటి సమస్యల పరిష్కారానికి ఏం చేసిందో ముందుగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రైతుల పేరుతో రాజకీయ విమర్శలు చేయడం కాకుండా, గత పాలనలో జిల్లాకు చేసిన అభివృద్ధిపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రశ్నించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేసి 25.35 లక్షల మంది రైతులకు రూ.20,677 కోట్ల మేర లబ్ధి చేకూర్చిందని తెలిపారు. రైతు భరోసా ద్వారా ఎకరాకు ఏడాదికి రూ.12 వేల పెట్టుబడి సాయం అందిస్తోందన్నారు. 2026 జూన్ 30న తొలి విడతగా 41.37 లక్షల మంది రైతులకు రూ.2,482.02 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రైతు బీమా, ఉచిత వ్యవసాయ విద్యుత్తు, సన్నధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి చర్యలతో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం మద్దతుగా నిలుస్తోందని వివరించారు.

ఆదిలాబాద్‌కు పరిశ్రమలు ఎక్కడ? యువతకు ఉద్యోగాలేవి?

పత్తి, సోయాబీన్, కందులు వంటి పంటలకు పేరుగాంచిన ఆదిలాబాద్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుకు గత ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పదేళ్లలో జిల్లాకు ఎన్ని పరిశ్రమలు తీసుకొచ్చారు? స్థానిక యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారు? అప్పటి మంత్రి జోగు రామన్న జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని తెలిపారు. ఆదిలాబాద్ జాయింట్ యూజర్ విమానాశ్రయానికి రూ.2,278.14 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, 2,009.23 ఎకరాల భూసేకరణకు చర్యలు చేపట్టిందన్నారు. భోరాజ్, భీంపూర్ ప్రాంతాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇవి కార్యరూపం దాలిస్తే జిల్లాలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలకు కొత్త మార్గాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.

కుప్టి, మత్తడివాగు, బోథ్ డిగ్రీ కళాశాలపై గత పాలకుల సమాధానం ఏది?

ఈ బోథ్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కుప్టి ఎత్తిపోతల పథకం, మత్తడివాగు కాలువల నిర్మాణం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు అంశాలపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటని అచ్యుతానంద్ రెడ్డి ప్రశ్నించారు. కుప్టి ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చినప్పటికీ పనులు ఎందుకు ముందుకు సాగలేదు? మత్తడివాగు కాలువల నిర్మాణం ఎందుకు పూర్తికాలేదు? బోథ్ విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు పదేళ్లలో ఏం చేశారో జోగు రామన్న స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.
ఇదే సమయంలో ప్రస్తుత ప్రభుత్వం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని వివరించారు. అదేగామలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల, పొచ్చెరలో రూ.45.15 కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, పిప్రి ఎత్తిపోతల పథకానికి రూ.50.70 కోట్లు, తేజాపూర్ ఎత్తిపోతల పథకానికి రూ.44.64 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. మూడు విద్యుత్ ఉపకేంద్రాల కోసం రూ.8.99 కోట్లు, ఇచ్చోడ నుంచి దేద్రా వరకు రహదారి నిర్మాణానికి రూ.30 కోట్ల అంచనా వ్యయంతో చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

ఆదిలాబాద్‌కు పదేళ్లలో ఎన్ని పరిశ్రమలు వచ్చాయి? స్థానిక యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారు? సాగునీటి సమస్యలను ఎందుకు పరిష్కరించలేకపోయారు? విమానాశ్రయం, పారిశ్రామిక పార్కు వంటి కీలక ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం సాధించిన పురోగతి ఏమిటి? ఈ ప్రశ్నలకు కేటీఆర్, జోగు రామన్న ప్రజల ముందు సమాధానం చెప్పాలని అచ్యుతానంద్ రెడ్డి కోరారు.
రైతులకు సాగునీరు, పంటలకు గిట్టుబాటు ధర, యువతకు ఉపాధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందినప్పుడే అభివృద్ధికి నిజమైన అర్థం ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయ ఆరోపణలకే పరిమితం కాకుండా గత పదేళ్ల పాలన, ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై బహిరంగ చర్చకు బీఆర్ఎస్ నాయకులు సిద్ధం కావాలని ఆయన డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగ రెడ్డి, పీఏసీ సభ్యుడు మహమ్మద్, ఇట్టడి రాజు రెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు నరసింహదాస్, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అబూద్, మాజీ ఎంపీటీసీ షేక్, మండల మైనారిటీ అధ్యక్షుడు షేక్ అలీమ్, వార్డు మెంబర్ షకీర్, పుండ్రు విజయ రాజు రెడ్డి, ఆత్మ డైరెక్టర్ రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు గర్జన పేరుతో రాజకీయ డ్రామా.. రైతుల సమస్యలపై మాట్లాడకుండా కేటీఆర్ పసలేని విమర్శలు !



సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాద్
చనాక--కొరాట బ్యారేజ్ అవినీతిపై సమాధానం చెప్పాలి..
పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం: బాలూరి గోవర్ధన్ రెడ్డి పసుల చంటి
నిన్న ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన కార్యక్రమం రైతు గర్జన కాదని, రైతుల పేరుతో నిర్వహించిన ఒక రాజకీయ ఈవెంట్ షో మాత్రమేనని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధులు బాలూరి గోవర్ధన్ రెడ్డి , పసుల చంటి విమర్శించారు. ఈరోజు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.
బాలూరి గోవర్ధన్ రెడ్డి గారు మాట్లాడుతూ, చనాక--కొరాట బ్యారేజ్ నిర్మాణంలో అవినీతి జరిగినట్లు ఆయన సొంత సోదరి కల్వకుంట్ల కవిత గారు చేసిన ఆరోపణలకు సమాధానం చెబుతారని ఆశిస్తే కేటీఆర్ గారు వాటిని పక్కనపెట్టి పసలేని రాజకీయ విమర్శలు చేశారని అన్నారు. తొలుత రూ.350 కోట్లుగా అంచనా వేసిన ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.1,800 కోట్లకు చేరినా, ఆదిలాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా సాగునీరు అందించలేని పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్--నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్, డ్రైపోర్ట్ ఏర్పాటు చేస్తామని గతంలో హామీలు ఇచ్చిన కేసీఆర్ ప్రభుత్వం కనీసం ఒక్క ఎకరం భూమిని కూడా సేకరించలేకపోయిందని బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఇండస్ట్రియల్ కారిడార్ వంటి కీలక ప్రాజెక్టులపై ప్రభుత్వం ముందడుగు వేస్తోందని తెలిపారు.రాష్ట్రంలో అప్పుల భారం ఉన్నప్పటికీ రైతులు పండించిన పంటను, ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని బడే బై చోటే బాయ్ అనడం వింతగా ఉందని కెసిఆర్ హయాంలో కేంద్ర ప్రభుత్వం తో ఘర్షణ దిగి రాష్ట్రానికి అన్యాయం చేశారని కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను బీజేపీ సిద్ధాంతాలను వ్యతిరేకంగా రాజకీయ పోరాటాలు చేస్తూనే, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అభివృద్ధి పనులకు నిధులు సాధించడం ముఖ్యమంత్రి గారి పరిపాలనా దక్షతకు నిదర్శనమని అన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఎక్కడా క్రాప్ హాలిడే ప్రకటించలేదని, బోర్లలో నీరు ఉన్న రైతులు వ్యవసాయం చేసుకోవచ్చని, ప్రాజెక్టుల కింద సాగునీటిని వినియోగించుకునే రైతులు డిసెంబర్ 31లోపు మూడో తడి అందేలా పంటల ప్రణాళిక చేసుకోవాలని మాత్రమే సూచించారని బాలూరి గోవర్ధన్ రెడ్డి గారు స్పష్టం చేశారు.
రైతులను తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచాలనే ఉద్దేశంతో కేటీఆర్ గారు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సొంత సోదరి కవిత గారు చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పలేని కేటీఆర్ గారు ఇతరులపై విమర్శలు చేయడం విడ్డూరమని అన్నారు.
అనంతరం జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసుల చంటి మాట్లాడుతూ, కేటీఆర్ గారు ఆదిలాబాద్‌కు రైతుల సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయంగా తమ పార్టీ నాయకులను ప్రోత్సహించడానికి, తమ బలాన్ని ప్రదర్శించడానికి వచ్చినట్లు ఉందని విమర్శించారు.కేసీఆర్ గారు పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆదిలాబాద్ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కడెం ప్రాజెక్టును కాపాడలేకపోవడంతో పాటు కుప్తి చిక్మన్ వంటి ప్రాజెక్టులను కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. జిల్లాకు ఉపయోగపడే సాగునీటి ప్రాజెక్టుల కంటే కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రాజకీయ ప్రచారానికే బీఆర్ఎస్ ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. రైతు కుటుంబాలకు ప్రభుత్వం అండగా లేదని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ, రైతు బీమా పథకం ద్వారా అర్హులైన రైతు కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు.
కేసీఆర్, కేటీఆర్ హయాంలో ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేకంగా ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదని, సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల ప్రాంతాలకే అభివృద్ధిని పరిమితం చేశారని ఆరోపించారు. యూరియా సరఫరా, యాప్ విధానం విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టడం సరికాదని అన్నారు. రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడకుండా ఇంటి నుంచే పొందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉందని, దేశంలోని పలు రాష్ట్రాల్లోనూ వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలపై ప్రభావం పడుతోందని, తెలంగాణలో మాత్రమే కరువు పరిస్థితులు ఉన్నట్లు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేయడం సరికాదని పసుల చంటి గారు అన్నారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో కరువు మండలాల ప్రకటనతో పాటు రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు.కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు, రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా కలిసి కేంద్ర ప్రభుత్వం బిజెపి పై పోరాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుదోవ పట్టించడం బీఆర్ఎస్ నాయకులు మానుకోవాలని ఆయన హితవు పలికారు.రైతుల సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే గత పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి ఏమిటో, చనాక--కొరాట బ్యారేజ్ ద్వారా ఒక్క ఎకరానికైనా సాగునీరు ఎందుకు అందించలేకపోయారో కేటీఆర్ గారు ప్రజలకు వివరించాలని ఇరువురు నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలకు పరిష్కారం చూపించడమే నిజమైన రైతు గర్జన తప్ప, ప్రజలతో చప్పట్లు కొట్టించుకోవడం కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కీజర్ పాష జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ ఇన్చార్జ్ బెజ్జంకి అనిల్ కుమార్ జిల్లా కాంగ్రెస్ సెక్రెటరీ మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్ , గోనెల స్వామి , యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుగత్ పట్టణంలోని వార్డు ప్రెసిడెంట్లు సంతోష్ ఫహీం , టౌన్ కాంగ్రెస్ సెక్రెటరీ ఆదిల్ , రాజా రెడ్డి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతకానిని కరువు మండలంగా ప్రకటించాలి

సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. :చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ చింతకాని మండల సమితి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గోదావరి జలాలతో బోనకల్ బ్రాంచ్ కాలువ ద్వారా చెరువులు కుంటలు నింపాలన్నారు. రైతు భీమా పునరుద్ధరించి , యూరియా యాప్ రద్దు చేయాలనీ కోరారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, వృద్ధాప్య పింఛన్లను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్లను రూ.6 వేలకు పెంచి ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని, దళితబంధు పథకానికి గతంలో మంజూరైన రూ.15.50 కోట్లను 155 దళిత కుటుంబాలకు తక్షణమే అందించాలని కోరారు. 3,800 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఇవ్వాలని, విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ వెంకటాయపాలెం నుంచి కొదుమూరు వరకు ఉన్న 100 అడుగుల రహదారి విస్తరణను గ్రామాల్లో 50 అడుగులకు పరిమితం చేస్తూ ఇండ్లకు నష్టం కలగకుండా చేయాలని, చిన్నమండవ గ్రామంలో మున్నేరు నుంచి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. అనంతరం 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కరుణశ్రీ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, జిల్లా సమితి సభ్యులు, చిన్నమండవ సర్పంచ్ పర్స రామచంద్రరావు, పావులూరి మల్లికార్జున్, కూచిపూడి రవి, పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు , నారపోగు హేమ, మండల సహాయ కార్యదర్శిలు మార్గం శ్రీను, అబ్బూరి ఉమామహేశ్వరరావు బసవపురం సర్పంచ్ ఆవుల నరసింహారావు , నాయకులు పగిడిపల్లి ఏసు, దొబ్బల వెంగళరావు, పదిమల్ల వెంకట నరసయ్య, గోగుల ఆది, గోగుల వెంకట్, హుస్సేన్, గుండ్ల బేబీ రాణి, తుపాకుల లక్ష్మీనారాయణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ నిధిలో రూ.25 లక్షల గోల్‌మాల్!

- మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన సొమ్ము సొంత అవసరాలకు వినియోగం..
- గ్రామసభలో అంగీకరించినట్లు వెల్లడి
- సోషల్ ఆడిట్‌తో వెలుగులోకి.. మహిళా సంఘాల సభ్యుల్లో ఆందోళన



సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు నవంబర్ 02 2026: ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం రేపల్లెవాడ గ్రామపంచాయతీలో స్త్రీ నిధి రుణాల చెల్లింపులకు సంబంధించిన నగదు వ్యవహారం కలకలం రేపుతోంది. మహిళా సంఘాల సభ్యులు నెలనెలా చెల్లించిన రుణ వాయిదాల సొమ్మును సంబంధిత ఖాతాల్లో జమ చేయకుండా, సుమారు రూ.25 లక్షలను వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు గ్రామ దీపిక రమాదేవి అంగీకరించినట్లు సమాచారం. ఈ వ్యవహారం సోషల్ ఆడిట్‌లో వెలుగులోకి రావడంతో మహిళా సంఘాల సభ్యుల్లో ఆందోళన నెలకొంది.

స్త్రీ నిధి ద్వారా రుణాలు పొందిన మహిళా సంఘాల సభ్యులు ప్రతి నెలా తమ వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నట్లు తెలిసింది. అయితే, సభ్యులు చెల్లించిన నగదు సంబంధిత ఖాతాల్లో జమ కాకపోవడంతో నిధుల లావాదేవీలపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో నగదు వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

ఈ అంశంపై సర్పంచ్ అజ్మీర సురేష్ నాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సుమారు రూ.25 లక్షల నగదును వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు గ్రామ దీపిక రమాదేవి అంగీకరించినట్లు సమాచారం. మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన సొమ్ము వారి రుణ ఖాతాల్లో జమ కాకపోవడంపై గ్రామసభలో చర్చించినట్లు తెలిసింది.

స్త్రీ నిధికి సంబంధించిన లావాదేవీల్లో ఎంత మొత్తం వసూలైంది? ఎంత మొత్తం సంబంధిత ఖాతాల్లో జమైంది? ఎంత మొత్తం వినియోగించారు? ప్రస్తుతం ఎంత బకాయి ఉంది? అనే అంశాలపై పూర్తిస్థాయి లెక్కలు తేల్చాల్సిన అవసరం ఉంది. మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన సొమ్ముకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలించి, వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

మహిళలు కష్టపడి సంపాదించిన సొమ్మును రుణ వాయిదాల రూపంలో చెల్లిస్తే, ఆ నగదు సక్రమంగా ఖాతాల్లో జమ కావాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, నిధుల వ్యవహారంలో బాధ్యులను గుర్తించడంతోపాటు, వినియోగించిన మొత్తాన్ని తిరిగి రాబట్టి మహిళా సంఘాల సభ్యులకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మహిళా సంఘాల సొమ్ముకు భద్రత కల్పించే విషయంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

గ్రామసభలో పాల్గొన్నవారు స్త్రీ నిధి మేనేజర్ వేణుగోపాల చారి, రీజినల్ మేనేజర్ రవీందర్ నాయక్, ఏపీఎం , సీసీ లు, సర్పంచ్ అజ్మీర సురేష్ నాయక్, ఉపసర్పంచ్ కాళంగి వీరభద్రం, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో స్థాయిలో అధ్యయనం చేస్తున్న. ఐపీఎస్ ఐఏఎస్ శిక్షణ అధికారులు



సికె.న్యూస్. నేరడిగొండ:నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామంలో నాలుగు రోజులపాటు గ్రామంలో శిక్షణ ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో అధ్యయనం చేస్తున్నారు వివిధ ప్రభుత్వ శాఖల అని తీరు సంక్షేమ పథకాల అమలు తీరు గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల. పై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ పర్యటనలో భాగంగా గ్రామాల్లో నేరుగా వెళ్లి ఇంటింటికి వాళ్ళ పరిస్థితిలో స్థితిగతులను తెలుసుకొని ప్రభుత్వానికి నివేది పంపుతున్నట్లు తెలిపారు రెండో రోజు పాఠశాలలో మౌలిక సదుపాయాలు విద్య పనితీరు విద్యార్థుల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు అలాగే ఉపాధ్యాయులు సమస్యలపై పనితీరు పరిశీలించారు

బతుకమ్మ ఆడిన శిక్షణ అధికారులు

కుమారి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉదయం శిక్షణ ఐఏఎస్ ఐపిఎస్ అధికారులు గ్రామంలో డోక్రా మహిళా సంఘాల మహిళలు పెద్ద ఎత్తున పాఠశాలకు చేరుకొని అధికారులతో. విద్యార్థులతో వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ బతుకమ్మ అని ఆట పాటలు తో బతుకమ్మలాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాగర్ రెడ్డి గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లసుమన్న.ఉప సర్పంచ్ ఆడెపు రవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు వివిధ శాఖల.అధికారు గ్రామస్తులు పాల్గొన్నారు

మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు -- ఆయుర్వేద ఔషధాలపై ప్రత్యేక డెమో



మధిర నవంబర్ 02(సికె న్యూస్)మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ఆయుర్వేద కన్సల్టెంట్ అనుసూరి శ్రీనివాసరావు చే విద్యార్థులకు శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవీంద్రారెడ్డి సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో ఎదురయ్యే ఒత్తిడిని సమర్థవంతంగాఎదుర్కొనేందుకు ఒత్తిడి నిర్వహణ (స్ట్రెస్ మేనేజ్‌మెంట్)అలవర్చుకోవాలని, ధ్యానం, సమయపాలన, క్రమశిక్షణ ద్వారా ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చని తెలిపారు. లక్ష్యాలను నిర్దేశించుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

అనంతరం ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ఆయుర్వేద కన్సల్టెంట్ అనుసూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత పరస్పరం అనుసంధానమై ఉంటాయని వివరించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, తగినంత నిద్ర, వ్యాయామం, సానుకూల ఆలోచనా విధానం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణలో ఆయుర్వేద ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ రకాల ఆయుర్వేద ఔషధాలను పరిచయం చేసి, వాటి గురించి ప్రత్యక్ష ప్రదర్శన (డెమో) ఇచ్చారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

కార్యక్రమానంతరం అనుసూరి శ్రీనివాసరావు ని కళాశాల తరఫున ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మరో ఆయుర్వేద ఔషధ కోఆర్డినేటర్ పాములపాటి అనిల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి జి. అరుణ, అధ్యాపకులు డా. ఎస్. ఇందిర, డా. పి. సుజాత, డా. వి. నాగరాజు, డా. ఎం.వి.ఎస్. శాస్త్రి, పి. లక్ష్మీనారాయణ, షేక్ ఇమ్రాన్, పిల్లి నాగేశ్వరరావు, ఎస్. జ్యోతి, పి. శ్రీనివాస్, టి. ఆదర్శ్, ఎస్.ఎస్. పృథ్వీరాజ్ మరియు అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట గ్రామం చిన్నమండవ గ్రామంలో 6 వ్యవసాయ విద్యుత్ మోటార్లు చోరీ



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండల పరిధిలోని చిన్నమండవ, సీతంపేట గ్రామాలకు చెందిన ఆరుగురు రైతుల వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఆదివారం రాత్రి చోరీ కి గురయ్యాయి. బాధితులు చింతకాని పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేశారు.

డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నియోజకవర్గం లో ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ లో అవతతవకలు.



- నిజమైన లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు చెందిందాలి
- అసలైన లబ్ధిదారులకి ఇందిరమ్మ ఇళ్ల అందటం లేదు
- గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు వర్గ పోరుతో లబ్ధిదారులకు ఇబ్బందులు
- కాంగ్రెస్ నాయకులు వర్గపోరుతో ఇష్టానుసారంగా ఇళ్లు పంపిణీ వాటాలుగా పంచుకున్న వైనం
- స్థానిక కాంగ్రెస్ నాయకులు కు లబ్ధిదారులు ఎంపిక చేసే అవకాశం ఇచ్చారా.
- ప్రభుత్వ అధికారులకు ఇచ్చారాలి
- స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ అనుకున్న వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చినట్టు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.
- నిజమైన లబ్ధిదారులకు లాటరీ ద్వారా ఎంపిక చేస్తే బాగుంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- గౌరవనీయులైన భట్టి విక్రమార్క కి,
- ఉప ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.

సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.విషయం: చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులోఅర్హుల పేర్ల మార్పులు, అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతున్నదని ఫిర్యాదు -- న్యాయం చేయాలని వినతి.

గౌరవనీయులైన సార్,

నేను ఆత్మకూరు కళావతి, ఔ/శీ రాంబాబు. చిన్నమండవ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ విషయంలో అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతున్నదని మీ దృష్టికి తీసుకువస్తున్నాను.గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో కొంతమంది స్థానిక కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకుంటూ, అర్హులైన లబ్ధిదారుల పేర్లను మార్చి, డబ్బులు తీసుకొని ఇతరులకు ఇళ్లను కేటాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల జాబితాలో పేర్లు మార్చి, నిజమైన అర్హులకు అన్యాయం చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆత్మకూరు కళావతి పేరుతో మంజూరైన ఇందిరమ్మ ఇంటిని కూడా వేరే వారికి కేటాయించినట్లు మా దృష్టికి వచ్చింది. దీనివల్ల మేము తీవ్రంగా నష్టపోయాము. అర్హులైన పేదలకు అందాల్సిన ప్రభుత్వ పథకం ప్రయోజనాలు అక్రమాలకు గురికాకుండా చూడాలని కోరుతున్నాము.

కావున, గౌరవనీయులైన మీరు దయచేసి:

1. చిన్నమండవ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై సమగ్ర విచారణ జరిపించాలి.
2. అసలు లబ్ధిదారుల జాబితాను పరిశీలించి, అర్హుల పేర్లను మార్చినట్లయితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలి.
3. ఆత్మకూరు కళావతి పేరుతో మంజూరైన ఇంటిని వేరే వారికి కేటాయించిన విషయాన్ని విచారించి, మాకు న్యాయం చేయాలి.
4. ఇళ్ల కేటాయింపులో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.
5. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

పేదలకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అనర్హులకు వెళ్లకుండా, నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా మీరు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను.

ఆత్మకూరు కళావతి
భర్త పేరు: రాంబాబు
గ్రామం: చిన్నమండవ
మండలం:

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు

మధిర నవంబర్ 02 (సికె న్యూస్)బోనకల్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పలు డిమాండ్లతో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పెన్షన్ల పెంపు, ఉపాధి హామీ పథకం సమర్థవంతమైన అమలు, రైతుల సమస్యల పరిష్కారం, పేదలకు సంక్షేమ పథకాల అందజేతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రభుత్వం స్పందించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు జక్కుల రామారావు, మండల కార్యవర్గ సభ్యులు బొమ్మినేని నాగేశ్వరరావు, నాయకులు గుంపుల జయరాజు, వనమా అశోక్, గొల్లపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రన్ని ప్రారంభించిన,సర్పంచ్ మహేశ్వరి సాయిబాబా



నవంబర్ 02 (సీ కే న్యూస్) చేగుంట : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు మద్దతు ధర కల్పించి, వారి పంటలను సజావుగా కొనుగోలు చేసేందుకు చేగుంట మండల పరిదిలోని చందాయిపేట్ గ్రామం లో వరి కొనుగోలు కేంద్రాలను సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా,ఉపసర్పంచ్ నాగేష్ గుప్తా , పంచాయతీ సెక్రటరీ కృష్ణ ,తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయించుకోవాలని సూచించారు, ఈ కార్యక్రమం లో సీసీ స్వామి,సిఏ,స్వామి, వ్యవసాయ విస్తరణ అధికారి దివ్య, రైతులు ఆంజనేయులు, మల్లేష్, వివో లీడర్స్,తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ .



నవంబర్ (02) సి కె న్యూస్ అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి నారాయణఖేడ్ పట్టణంలోని ప్రభుత్వ జెడ్పీజీహెచ్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో సోమవారం ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో సాలారే మిల్లత్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా పదో తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ ఎస్ఎస్సీ మోడల్ టెస్ట్ పేపర్లను ఎంఐఎం సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి, కర్వాన్ ఎమ్మెల్యే జనాబ్ కౌసర్ మొహియుద్దీన్, నారాయణఖేడ్ ఎంఐఎం అధ్యక్షులు న్యాయవాది మొహీద్ పటేల్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. యాదవ రెడ్డి, ఎస్.ఏ. మనన్, మొహమ్మద్ పాషా మియా, ఎంఐఎం నాయకులు షేక్ అమ్జద్, ముజీబ్ ఖాన్, హబీబ్ అబ్దుల్లా, షేక్ ఫయాజ్, అహద్ పటేల్ తదితరులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

గుడుంబా, మద్యపానంపై నిషేధం

భారీ జరిమానాలు విధిస్తూ ఏకగ్రీవ తీర్మానం



సికె న్యూస్ మహబూబాబాద్ జిల్లా (పతినిధి:దుర్గం మురళి మహబూబాబాద్: గంగారం మండలం దుబ్బగూడెం గ్రామ పంచాయితీ పరిధిలో మద్యం, గుడుంబా రహిత గ్రామాలుగా మార్చేందుకు గ్రామస్తుల పూర్తి మద్దతు, సహకారంతో పాలకవర్గం, గ్రామ పెద్దలు సంచలన నిర్ణయం తీసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గుడుంబా తయారీ, అమ్మకాలు, మద్యపానాన్ని పూర్తిగా నిషేధిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు.?ఈ క్రమంలో నియమ నిబంధనలను ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలు విధిస్తూ పంచాయతీ పాలకవర్గం కఠిన నిర్ణయాలు ప్రకటించింది.

తీర్మానించిన జరిమానాల వివరాలు:

గుడుంబా విక్రయదారులకు: ?25,000 నగదు జరిమానా
మద్యం విక్రయదారులకు: ?50,000 నగదు జరిమానా
మద్యం సేవించిన వారికి: ?15,000 నగదు జరిమానా

ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం సంధ్యారాణి, ఉప సర్పంచ్ గోగు పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... గ్రామంలో శాంతిభద్రతలు కాపాడటానికి, కుటుంబాల్లో వెలుగులు నింపడానికి, యువత భవిష్యత్తును కాపాడటానికే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిబంధనలు గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలకు వర్తిస్తాయని, ప్రతి ఒక్కరూ దీనికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో వార్డు మెంబర్లు లక్ష్మణ్, కమలాకర్, పద్మ, నర్సమ్మ, సమ్మయ్య, యాకలక్ష్మి, సుగుణలతో పాటు గ్రామ పెద్దమనుషులు బండి సుధాకర్, జనగం లక్ష్మినారాయణ, పోలేబోయిన సమ్మయ్య, సువర్ణపాక నాగయ్య, వడ్లకొండ శ్రీను, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలు, యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పూర్తి మద్దతు తెలిపారు.

రాయపట్నం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం






మధిర నవంబర్ 02 (సికె న్యూస్) రాయపట్న గ్రామంలో జింకల కృష్ణారావు ధనలక్ష్మి గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పారుపల్లివిజయకుమార్ ఈ గృహప్రవేశకార్యక్రమంలో.....

మధిర మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సూరంశెట్టిలి లికిషోర్ జిల్లా అధికార ప్రతినిధి,కర్నాటి రామారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్,అద్దంకి రవికుమార్, నిడమానూరు వంశీకృష్ణ, ఖమ్మంపాడు సర్పంచ్,బట్ట అంజన బాబు, 13వ వార్డు కౌన్సిలర్ శ్రీపాలశెట్టి వెంకట్రావు, కోట డేవిడ్ జాకీర్ హుస్సేన్ దూదేకుల జానీ గద్దల ప్రకాశరావు (నాని) గద్దల రాజా జింకల మురళి తుమ్మలపల్లి రామారావు మఠం రామకృష్ణ రంగిశెట్టి నాగేశ్వరావు జింకల ఈశ్వరరావు మొదలగు వారు పాల్గొన్నారు.

తరం మారినా చెరగని అనుబంధం - తెలుగుదేశానికి వాసిరెడ్డి రామనాథం గారి నిబద్ధత

- జన్మదిన సందర్భంగా ప్రత్యేక ఆర్టికల్
- ఎన్టీఆర్ నుండి లోకేష్ వరకు.. నాలుగు దశాబ్దాల నమ్మకమైన ప్రయాణం



మధిర నవంబర్ 02 (సికె న్యూస్)మధిర లో రోజు పుట్టినరోజు జరుపుకుంటున్న డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అంటే కేవలం ఒక పేరు కాదు, తెలుగుదేశం పార్టీకి ఒక చరిత్ర. మీరు పంపిన ఫోటోలో కనిపిస్తున్న 3 చిత్రాలు ఆ చరిత్రను చెప్తున్నాయి:

అన్నగారితో అనుబంధం – మొదటి ఫోటోవిశ్వవిఖ్యాత నటసార్వభౌమ, తెలుగుదేశం వ్యవస్థాపకుడు స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు తో యవ్వనంలోనే ఆయనకు ఉన్న అనుబంధం. ఎన్టీఆర్ పిలుపుతోనే పార్టీలోకి వచ్చి, మధిర గడ్డపై పసుపు జెండా ఎగరేసిన తొలి తరం నాయకుడు రామనాథం ఆనాటి నుండి ఈనాటి వరకు పార్టీ మారకుండా, సిద్ధాంతం వీడకుండా ఉన్న అరుదైన నాయకుడు.చంద్రబాబు గారితో విశ్వాసం రెండవ ఫోటో పార్టీ కష్టకాలంలో, అధికారంలో ఉన్నా లేకున్నా శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి అత్యంత నమ్మకమైన సైనికుడిగా నిలిచారు. తెలంగాణలో టీడీపీని కాపాడుకోవాల్సిన సమయంలో ఖమ్మం జిల్లా బాధ్యతను భుజాన వేసుకుని, పార్టీని వీడిన వారెందరో ఉన్నా, పసుపు కండువానే తన ఆత్మగౌరవంగా భావించారు. అందుకే చంద్రబాబు ఆయనకు ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్, మధిర ఇంఛార్జి వంటి కీలక బాధ్యతలు అప్పగించారు.లోకేష్ తో భవిష్యత్ వైపు మూడవ ఫోటోయువ నాయకుడుశ్రీ నారా లోకేష్ తోకలిసి పని చేస్తూ, యువతను పార్టీ వైపు ఆకర్షిస్తున్నారు. ఇఁ్ణా, తెలుగు యువతనుముందుకుతీసుకెళ్తూ,పార్టీకికొత్తరక్తాన్నిఅందిస్తున్నారు. ఇది కేవలంఫోటోకాదు,మూడు తరాల తెలుగుదేశం వారధి.

పార్టీలో చేసిన కార్యక్రమాలు:

తెలంగాణలో టీడీపీ ఉనికి కోసం పోరాటం:లి తెలంగాణ వచ్చాక పార్టీకష్టాల్లోఉన్నప్పుడుఖమ్మంజిల్లాలోపార్టకార్యాలయాన్ని నడిపించింది ఆయనే.

మధిర నియోజకవర్గంలో నిరంతరం ప్రజల్లో: వైద్యుడిగా ఉచిత వైద్య శిబిరాలు, పేదలకు సాయం, రైతులకు అండ.

పసుపు పండుగలు,మహానాడు, సభ్యత్వనమోదుప్రతికార్యక్రమంలోముందుండేనాయకుడు.కార్యకర్తలకు కష్టం వస్తే ఆదుకునే పెద్దన్న పాత్ర.అందుకే ఆయన కేవలం కన్వీనర్ కాదు, మధిర టీడీపీ కుటుంబానికి పెద్ద దిక్కు.

అలాంటినాయకుడికిమనమంతా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేద్దాం.మధిర పట్టణ టీడీపీ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు మరియు టీడీపీ కుటుంబం

డా. వాసిరెడ్డి రామనాథం గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన యువజన కాంగ్రెస్ నాయకులు దోర్నాల వెంకటరవి



మధిర నవంబర్ 02(సికె న్యూస్)తెదేపా ఖమ్మం పార్లమెంటరీ కమిటీ కన్వీనర్, ఎఁ్ణా మధిర నియోజకవర్గ ఇంచార్జి గౌ॥ శ్రీ డాక్టర్ వాసిరెడ్డి రామనాథంలి కి మధిర నియోజకవర్గ యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ శ్రీ దోర్నాల వెంకట రవి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రామనాథం నిండునూరేళ్లు, ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మూతపడిన ఎంపీడీవో కార్యాలయ కాంప్లెక్స్‌లు.. అద్దెదారుల ఆవేదన!



వ్యాపారాలు లేకున్నా అద్దె భారం తప్పడం లేదంటున్న బాధితులు

సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు నవంబర్ 03 2026: ఏన్కూరు నుంచి నాచారం వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో రహదారి పక్కన ఉన్న ఎంపీడీవో కార్యాలయ కాంప్లెక్స్‌లు గత నెలన్నర రోజులుగా మూతపడి నిరుపయోగంగా మారాయి. దీంతో ఆయా కాంప్లెక్స్‌లను అద్దెకు తీసుకొని వ్యాపారాలు నిర్వహించుకునే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పనుల కారణంగా దుకాణాలు తెరవలేక, వ్యాపారాలు సాగక ఆదాయం కోల్పోతున్నప్పటికీ నెలనెలా అద్దె చెల్లించాల్సి వస్తోందని అద్దెదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారాల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకునే తమకు ఉపాధి లేక ఆర్థిక భారం పెరిగిందని వాపోతున్నారు. రహదారి నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయో, తిరిగి ఎప్పటి నుంచి వ్యాపారాలు ప్రారంభించుకోవచ్చో స్పష్టత లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని, అయితే వాటి కారణంగా నష్టపోతున్న తమ పరిస్థితిని కూడా సంబంధిత అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు స్పందించి కాంప్లెక్స్‌ల సమస్యను పరిష్కరించడంతోపాటు, వ్యాపారాలు సాగక ఇబ్బందులు పడుతున్న అద్దెదారులకు ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎల్‌నినో ప్రభావంపై గ్రామ ప్రజలకు అవగాహన



తెలంగాణ సంస్కృతి కళాబృందంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం

మల్దకల్ నవంబర్ 2: జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పెద్ద తాండ గ్రామపంచాయతీ సర్పంచ్ యం. నార్య నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి కళాబృందం ద్వారా గ్రామ ప్రజలకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావం కారణంగా ఎదురయ్యే నీటి కొరత, విద్యుత్ వినియోగ సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి కళాబృందం సభ్యులు వివిధ కళారూపాల ద్వారా ఎల్‌నినో ప్రభావంతో కలిగే పరిణామాలను వివరించారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, విద్యుత్‌ను వృథా చేయకుండా అవసరమైన మేరకే ఉపయోగించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అనంతరం సర్పంచ్ యం. నార్య నాయక్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే అవసరం లేని సమయంలో విద్యుత్ పరికరాలను ఆఫ్ చేయడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చని తెలిపారు. నీరు, విద్యుత్ వంటి సహజ వనరులను బాధ్యతగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యం. లక్ష్మణ్ నాయక్, వార్డు మెంబర్ యం. కిషోర్, ఫీల్డ్ అసిస్టెంట్, తెలంగాణ సంస్కృతి కళాబృందం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏన్కూరు తహసీల్దార్‌గా సత్యనారాయణ



బాధ్యతలు చేపట్టిన తొలిరోజే ప్రజావాణికి హాజరు

సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు నవంబర్ 03 2026: ఖమ్మం జిల్లా ఏన్కూరు మండల నూతన తహసీల్దార్‌గా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏన్కూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సీహెచ్ శేషగిరిరావు బదిలీపై వెళ్లడంతో, సత్తుపల్లి నుంచి బదిలీపై వచ్చిన సత్యనారాయణ ఏన్కూరు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే ఆయన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వారి నుంచి అందే ఫిర్యాదులు, వినతులను సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం కీలక వేదికగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో నూతన తహసీల్దార్ సత్యనారాయణ ప్రజావాణిలో పాల్గొని ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధించిన కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంటూ, రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ సమస్యలు, భూ రికార్డులు, ఇతర రెవెన్యూ వ్యవహారాల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఈ సందర్భంగా అక్కడి అధికారులు నూతన తహసీల్దార్ సత్యనారాయణను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు అధికారులు అభినందనలు తెలియజేశారు.

డా. రామనాథం నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి

- డా. వాసిరెడ్డి రామనాథంకు చైర్ పర్సన్ సుజాత రామనాథం జన్మదిన శుభాకాంక్షలు



మధిర నవంబర్ 02 (సికె న్యూస్)మధిర తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్,ప్రముఖ వైద్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం జన్మదిన వేడుకలు సోమవారం మధిరలో ఘనంగా జరిగాయి.ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం.. డా. వాసిరెడ్డి రామనాథంను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శాలువా కప్పి,పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.డా.రామనాథం భగవంతుని ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో నిండునూరేళ్ల సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆమె ఈ సందర్భంగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అర్నాటి రామారావు,సూర్యదేవర కోటేశ్వరరావు,మిరియాల వెంకటరమణ గుప్తా పాల్గొని రామనాథంకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

సంఘాల పార్కును పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల నర్సింహులు యాదవ్





సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల గద్వాల్ పట్టణంలోని సంఘాల పార్కును కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల నర్సింహులు యాదవ్ లి సందర్శించి పరిశీలించారు. పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఏర్పాటు చేస్తున్న వివిధ అలంకరణ బొమ్మలు, చిన్నారుల ఆటవస్తువులు, పార్కు పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పార్కును మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది, ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పార్కు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై అక్కడి సిబ్బందితో చర్చించారు.

ఈ కార్యక్రమంలో...

మాజీ కౌన్సిలర్ నరహరి గౌడ్

. రిజ్వాన్. మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు

బోనకల్ గురుకుల ప్రమాదంపై కలెక్టర్‌కు స్వేరో బృందం వినతి

విద్యార్థినుల భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలి



సి కే న్యూస్ :బోనకల్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఇటీవల తరగతి గది పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో ఇద్దరు విద్యార్థినులు గాయపడిన ఘటనపై స్వేరో బృందం నాయకులు స్పందించారు. తొమ్మిదో తరగతి విద్యార్థినులు చాపలమడుగు పూజిత, అద్దంకి కీర్తన ఈ ప్రమాదంలో గాయపడగా, పూజిత తలకు ఆరు కుట్లు పడ్డాయి. ప్రస్తుతం ఇద్దరూ కోలుకుంటున్నారు.

గురుకుల పాఠశాలలోని ఆరు తరగతి గదుల పైకప్పులు గత నాలుగేళ్లుగా శిథిలావస్థలో ఉన్నాయని, అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్వేరో బృందం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన పాఠశాలను సందర్శించి భవన పరిస్థితిని పరిశీలించారు.

అనంతరం ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.ను కలిసి వినతిపత్రం అందజేశారు. బోనకల్ గురుకుల పాఠశాల భవనానికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలల భవనాల భద్రతను తనిఖీ చేయాలని కోరారు. విద్యార్థినుల ప్రాణాలకు రక్షణ కల్పించేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తక్కెళ్ళపల్లి ... అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

- కవితమ్మకు క్షమాపణ చెప్పాలి
- బహుజనుల బాణం కవితమ్మ
- తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్
- రాష్ట్ర నాయకులు కిషన్ నాయక్





సి కే న్యూస్ ..ఖమ్మం, నవంబర్ 2:బిఆర్ఎస్ నాయకుడు తక్కెళ్లపల్లి రవీందర్ రావు పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని, ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన(టిఆర్ఎస్) ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఎస్కే హుస్సేన్ పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధ్యక్షురాలు కవితమ్మ బహుజనుల బాణమని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం కవితమ్మ పని చేస్తోందన్నారు. రవీందర్ రావు గురించి అందరికీ తెలుసునని అన్నారు. తప్పుడు పద్ధతుల్లో డబ్బులు సంపాదించారని ఆరోపించారు. ఆయన ఎక్కడ పాదం మోపినా అక్కడ బిఆర్ఎస్ కు నష్టమేనన్నారు. మాట్లాడే ముందు నోరు అదుపులో ఉంచుకోవాలన్నారు. టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, బంజారా విభాగం రాష్ట్ర అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్ మాట్లాడుతూ.... రవీందర్ రావు మాటలు దొర పలికినట్లుగా ఉన్నాయన్నారు. ఆయన లాగా మాట్లాడడానికి తమకు సంస్కారం అడ్డు వస్తోందన్నారు. బహుజనుల కోసం కవితమ్మ వచ్చిందని, దీనిని ఓర్వలేక పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని అన్నారు. వెంటనే కవితమ్మకు రవీందర్ రావు క్షమాపణలు చెప్పాలన్నారు. ఇకపై నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండింటిలోనూ బీసీ బిడ్డలకే టికెట్ ఇచ్చారన్నారు. పట్టభద్రులు తమ పార్టీని ఆదరించాలన్నారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ ఉపాధ్యాయ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోరం వీర భద్రరావు, ఎస్టీ సెల్ జిల్లా ప్రెసిడెంట్ గుగులోత్ రాజ్ కుమార్ నాయక్, పార్టీ జిల్లా నాయకులు వనం నాగేందర్, కార్మిక సంఘం (టిఆర్టియు) జిల్లా అధ్యక్షులు జక్కుల ప్రకాశ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి జఔూచీ విద్యార్థుల క్రీడా పోటీలు



మహబూబాబాద్ ::గూడూరు మండలంలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల జఔూచీ కోసం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి ఆడెపు సుజాత చేతులమీదుగా బహుమతుల ప్రధాన చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ మమత, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఝామీ వెంకటేశ్వర్లు గారు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ,జఔూ శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం -- డాక్టర్ నరేష్ జాదవ్



సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాద్

కేటీఆర్‌కు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు -- ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు

న్యూఢిల్లీ: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఆదిలాబాద్ జిల్లాకు చేసిందేమీ లేదని, ఇప్పుడు రైతు గర్జన పేరుతో ఆదిలాబాద్‌కు వచ్చి రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ విమర్శించారు.

ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వ్యవసాయ పనిముట్లు, గిట్టుబాటు ధర కల్పించడంలో ఎలాంటి చొరవ చూపలేదని ఆరోపించారు. 2014కు ముందు ఉన్న ప్రాజెక్టులు, చెరువులు మినహా కొత్తగా కనీసం ఒక్క ఎకరానికైనా అదనంగా సాగునీరు అందించారా? అని కేటీఆర్‌ను ప్రశ్నించారు.

గిరిజనులు, దళితులు అధికంగా ఉన్న ఆదిలాబాద్ జిల్లాలో పదేళ్లలో కనీసం యూనివర్సిటీ, ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు కోసం కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నించలేదన్నారు. పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్ జిల్లాకు ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదని విమర్శించారు.

చనాకా-కొరాట ప్రాజెక్టు డీపీఆర్ తొలుత రూ.350 కోట్లతో రూపొందించగా, ఇప్పుడు దాని వ్యయం దాదాపు రూ.2,000 కోట్లకు చేరిందని, దీనికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.కేటీఆర్ వ్యక్తిగత విమర్శలు మానుకుని అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఆదిలాబాద్ జిల్లాకు ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని, తాను ఎక్కడైనా చర్చకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు.

రైతు రుణమాఫీ విషయంలో రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుని అర్హులైన కుటుంబాలకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసినట్లు వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగాయని, సుమారు రూ.1.26 లక్షల కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని విమర్శించారు.

తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి ఉంటే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశం ఉండేదని, కాళేశ్వరం మార్పుతో విద్యుత్ ఖర్చులు, నిర్వహణ భారం పెరిగాయని ఆరోపించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, గత ప్రభుత్వ హయాంలో నెలాఖరు వరకు కూడా జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉండేదని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా రెండేళ్ల సమయం ఉన్నందున ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని డాక్టర్ నరేష్ జాదవ్ స్పష్టం చేశారు.

ఈ మీడియా సమావేశంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు దుర్గం భాస్కర్, ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నం పెట్టే అన్నదాత కళ్లల్లో కన్నీళ్లు..

- నేలపాలైన వరి పంట! రైతన్నకు కన్నీటి వ్యథ!
- దిక్కుతోచని స్థితిలో రైతు కుటుంబం
- కోత యంత్రం కూడా దిగలేని పరిస్థితి.. ఆదుకోవాలని అధికారులకు వేడుకోలు

సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు నవంబర్ 02 2026: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట కళ్ల ముందే నేలకొరిగిపోవడంతో ఆ రైతు గుండె చెరువవుతోంది. అప్పులు చేసి, కుటుంబ సభ్యులతో కలిసి రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన పంట చేతికందే సమయంలో అకాల వర్షం, బలమైన ఈదురుగాలులు రైతు ఆశలను నేలమట్టం చేశాయి. మండల పరిధిలోని ఆరికాయలపాడు గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వర్లు, తండ్రి నాగయ్య, ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా రెండు ఎకరాల్లో వరి సాగు చేశాడు. పంట బాగా పండితే కుటుంబానికి ఆసరాగా ఉంటుందని, పెట్టిన పెట్టుబడులు తిరిగి వస్తాయని ఆశపడ్డాడు. అయితే గత కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి తోడు అదే రోజు వీచిన బలమైన ఈదురుగాలులతో వరి పంట మొత్తం నేలకొరిగింది. మరికొద్ది రోజుల్లో కోతకు వచ్చి చేతికందాల్సిన పంట ఇలా నేలపాలవడంతో రైతు ఆశలన్నీ ఆవిరయ్యాయి. పొలంలో వరి కంకులు నేలవాలిపోవడం, పంట మొత్తం చెల్లాచెదురుగా పడిపోవడంతో రైతు ఆవేదన వర్ణనాతీతంగా మారింది. నేలకొరిగిన పంటను కోయాలన్నా కోత యంత్రం పొలంలోకి దిగే పరిస్థితి లేకపోవడంతో ఏం



చేయాలో తెలియక వెంకటేశ్వర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. పంటను వదిలేస్తే పెట్టిన పెట్టుబడి పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని, కోత కోయించాలన్నా సాధ్యం కాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కష్టపడి పండించిన పంట కళ్ల ముందే నాశనమవుతుంటే రైతు కుటుంబం పడుతున్న బాధ వర్ణనాతీతం. ప్రకృతి ప్రకోపానికి తన శ్రమంతా వృథా కావడంతో ఆ కుటుంబం దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఇప్పటికైనా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు గ్రామానికి వచ్చి దెబ్బతిన్న వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి, జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని రైతు కోరుతున్నాడు. పంట నష్టాన్ని పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హమైన సహాయం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని గాలి వెంకటేశ్వర్లు కన్నీటితో వేడుకుంటున్నాడు.

అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తాం

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్
- దేవునిబండ తండాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు సీకే న్యూస్ ప్రతినిధి నవంబర్ 02 : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం దేవునిబండ తండా గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం సర్పంచ్ ఎం. శ్రీను నాయక్ అధ్యక్షతన, ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీను నాయక్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. అర్హత కలిగిన వారందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సహకరించిన ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డికి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు దేవునిబండ తండా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్యామ్‌లాల్, సర్పంచులు ఆర్. బాబు నాయక్, శివకుమార్, జంగయ్య, మాజీ సర్పంచులు కె. యాదయ్య, కె. బాలు, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, పుల్లారెడ్డి, దేవగిరి నవీన్, వార్డు సభ్యులు పి. జాను, పి. మారు, డి. ఈశ్వర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాదావత్ విరేష్, కె. దశరథ్, డి. సుమన్, లక్ష్మణ్, జగన్, గ్రామ నాయకులు భాస్కర్ నాయక్, శంకర్ నాయక్, మూడవత్ చందు తదితరులతో పాటు గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు..

నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



హాజరైన బీఆర్ఎస్ నాయకులు,ప్రజా ప్రతినిధులు

షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు సీకే న్యూస్ ప్రతినిధి నవంబర్ 02 : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలం రామచంద్రపూర్ మాజీ సర్పంచ్ జాంఫీర్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ సందర్భంగా జంఫీర్ కు మరియు వారి కుటుంబ సభ్యులకు నూతన గృహప్రవేశ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రామకృష్ణ, కొందుర్గు మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, చౌదరిగూడ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు హఫీస్,మాజీ అధ్యక్షులు నర్సింగ్ రావు,మాదేవ్ పూర్ సర్పంచ్ అనుష రవీందర్ రెడ్డి,కొందుర్గు సర్పంచ్ ప్రభాకర్,మల్కంపహాడ్ సర్పంచ్ రవీందర్ నాయక్,పెద్ద ఎల్కిచర్ల సర్పంచ్ సోనీ శేఖర్,మాజీ సర్పంచులు బాబురావు,అక్రమ్,గోపాల్ నాయక్ ఉప సర్పంచ్లు చంద్రశేఖర్,బాల్ రాజ్, గోపీగడ్డ బాల్ రాజ్,కంటెస్టెడ్ సర్పంచ్లు శ్రీకాంత్,అనంత రాములు,బీఆర్ఎస్ గ్రామ కమిటీల అధ్యక్షులు కొందుర్గు కారుకొండ యాదగిరి,శ్రీరంగపూర్ యాదయ్య,మహదేపూర్ రాములు,ముట్ పూర్ వేణు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెల్లెపాడు లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద కాపర్ వైర్ల చోరీ.. నిందితుల అరెస్ట్

- రైతుల అప్రమత్తతతో దొంగల ఆటకట్టు.. కాపర్ వైర్లు స్వాధీనం
- చోరీకి పాల్పడిన వారు జటప్రోలు గ్రామస్తులుగా గుర్తింపు



సీకే న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి చిన్నంబావి మండలంలోని చెల్లెపాడు ఎత్తిపోతల పథకం వద్ద కాపర్ వైర్ల చోరీకి పాల్పడుతున్న నిందితులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. రైతుల అప్రమత్తతతో చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. చెల్లెపాడు గ్రామానికి చెందిన రైతులు రాత్రి సమయంలో పంట పొలాలకు నీళ్లు కడుతున్నారు క్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ సమీపంలో ఇనుప వస్తువుల శబ్దం వినిపించడంతో అనుమానం వచ్చి అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈ క్రమంలో కాపర్ వైర్లు చోరీ చేస్తున్న దుండగులను గుర్తించారు. ఒక నిందితుడు బైక్‌పై పరారవగా, మరొకరు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. గ్రామస్తులు స్థానిక ఎస్సై రామన్ గౌడ్ కు సమాచారం అందించారు, తక్షణమే స్పందించిన ఎస్ఐ సంఘటన స్థలానికి బయలుదేరారు. మార్గం మధ్యలో ఇటుగా వస్తున్న బైకులను ఆపి పరిశీలించగా నిందితులు వెల్టూరు, చిన్నమారుర్ రహదారి సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు జటప్రోల్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం. చోరీకి గురైన కాపర్ వైర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మూడు నెలల క్రితం చిన్నమారు ఎత్తిపోతల పథకం ఫేజ్-2 వద్ద కూడా కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఘటన మరువక ముందే తాజాగా మరో చోరీ వెలుగులోకి రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎత్తిపోతల పథకాల వద్ద నిఘా పెంచాలని రైతులు పోలీసులను కోరుతున్నారు. ఈ ఘటనపై అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాషువా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామన్ గౌడ్ తెలిపారు. చోరీలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు.

రిలే నిరాహార దీక్షకు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సంఘీభావం తెలిపినారు



షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు సి కె న్యూస్ ప్రతినిధి నవంబర్ 02 : రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు చేపట్టిన పోరాటానికి అంజయ్య యాదవ్ సంఘీభావం తెలిపారు డంపింగ్ యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమకారులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష సిబిరాని సందర్శించి వారికి మద్దతు ప్రకటించారు ప్రజల ఆరోగ్యం పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా డంపింగ్ యార్డ్ సమస్యను మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ జీవో నెంబర్ 641 ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 30వ రోజు రిలే నిరాహార దీక్షలో పోల్కని గుట్ట తండా ప్రజలు పాల్గొన్నారు ఈ నిరాహార దీక్షలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని తన సంఘీభావని ప్రకటించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవించే హక్కులను రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు ప్రజల అభిప్రాయాన్ని పరిణగంలోకి తీసుకోకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రైతులు జేఏసీ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి అధ్యక్ష వాయిస్తున్న సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మూడవ రాంబాబు నాయక్ మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈటా గణేష్ మాజీ సర్పంచ్ వడ్డే బాలయ్య టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తీగాపురం కృష్ణయ్య సర్పంచ్ భాస్కర్ నాయక్ మాజీ సర్పంచ్ మూడవ లక్ష్మీ నాయక్ రమేష్ తారా సింగ్ పాల్తరాజు హరిబాబు వినోద్ శ్రీను రెడ్డి రాజేందర్రెడ్డి శ్రీధర్ చారి నరేందర్ రెడ్డి బాబు రాజు నాయక్ నాగేష్ నాయక్ మహేష్ మల్లేష్ ప్రతాప్ రెడ్డి కృష్ణారెడ్డి రాజప్ప నేపాల్ శేఖర్ శ్రీనివాస్ నవీన్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

గంగారం మండలంలో ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన



సికె న్యూస్ నవంబర్ 2 మహబూబాబాద్ జిల్లా (ప్రతినిధి: దుర్గం మురళి :గంగారం మండలంలోని దుబ్బగూడెం, పోసుగొండ్ల, కామారం, కోమట్లగూడెం గ్రామ పంచాయతీల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు గంగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ముడిగ వీరభద్ర పోతయ్య ఆధ్వర్యంలో,లి మాజీ జెడ్పీటీసీ ఈసం రమ సురేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గిరగాని ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి జనగాం కృష్ణస్వామి లు పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో ఎమ్మెల్సీ ఓటు ఉన్నవారు కూడా మళ్లీ కొత్తగా ఫారం-18 ద్వారా నమోదు చేసుకోవాలని, నవంబర్ 6 చివరి తేదీ లోపు అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. డిగ్రీ అర్హత కలిగిన యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు తమ ఓటును నమోదు చేసుకోవడం ద్వారా విద్యావంతుల గళాన్ని శాసనమండలిలో వినిపించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొమురం బీమ్ ఆశయ సాధనే లక్ష్యంగా పోరాటాలు చేద్దాం.తుడుందెబ్బ నేతల పిలుపు,బయ్యారం మండల కేంద్రం లో ఘనంగా భీం 86వ వర్ధంతి



సి కె న్యూస్ ప్రతినిధి ఇల్లందు. నవంబర్ 02/11/2026. బయ్యారం మండల కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీల ఆశా జ్యోతి నిజాం నైజామ్ నవాబుల పై జల్, జంగిల్, జమీన్ ల పై భూమి పుత్రులమైన తమ కే దక్కాలని గెరిల్లా పోరాటం చేసి అడవి జాతి తెగలను విముక్తి చేసిన మహా గోండ్ వీరుడు కొమురం భీం 86వ వర్ధంతిని పురస్కరించు కొని, జాతీయ అధ్యక్షులు గోగ్గల కోటయ్య,రాష్ట్ర అధ్యక్షులు ఈసం నరసింహారావు,రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఆగబోయిన రవి,కొమురం భీమ్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ కొమురం బీమ్ పోరాటాల ఫలితంగానే ఆదివాసులకు ప్రత్యేక భూభాగం, భారత రాజ్యాంగం లోని 5వ షెడ్యూల్ లో ఆదివాసులకు అనేక హక్కులు చట్టాలు కల్పించి ఆదివాసుల ఆత్మ రక్షణ కై భూ రక్షణ కోసం 1/70 చట్టం, ఈ ప్రాంతం లోని అన్నీ రకాల స్వయం నిర్ణయాధికారం ఆదివాసులే తమకు తాము గ్రామ సభల ద్వారా ఏర్పర్చుకొనుటుకు గాను పెసా చట్టం, వచ్చిందని కానీ నేడు పాలకులు ఈ చట్టాలను అమలు చేయక పోగా ఇష్టానుసారంగా వలస వాదులకు ఆదివాసుల చట్టాలను అతిక్రమించి చట్ట విరుద్ధంగా అన్ని రకాల సదుపాయలను కల్పిస్తున్నారని, ఆదివాసీల అదీనం లో ఉండబడిన వేలాది ఎకరాల భూమి గిర్జనేతరుల అదీనం లో ఉన్నా చట్టాలను అమలు చేసి ఆదివాసీలకు ఇప్పించాల్సింది పోయి అవి ఏవి పట్టించుకోవడం లేదని,ఏజెన్సీ ఏరియాలో అక్రమ కట్టడాలు బహుళ అంతస్థులు, భారీ రైస్ మిల్లు లు, పంక్షన్ హల్స్,పెట్రోల్ బంక్ లు అక్రమంగా నిర్మాణాలు జరిగి చట్టాలు ఉల్లంగణకు గురౌతున్నయని,రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆదివాసి సంఘాలు వాపోతున్నారు,,

అయోధ్య శ్రీరామ మందిరాన్ని దర్శించుకున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్

శ్రీరాముడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించిన ఆడే గజేందర్

సికె.న్యూస్.



అదిలాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రమైన అయోధ్యలోని శ్రీరామ మందిరాన్ని ఈ రోజు ఉదయం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ గారు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా శ్రీరాముడి దర్శించుకుని, శ్రీరాముడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారుఆయన వెంట బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, బోథ్ మండల అధ్యక్షుడు మెరుగు భోజన్న,సీనియర్ నాయకులు సాయన్న ముదిరాజ్,బుక రాములు,జిల్లా ఉపసర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు సుద్దులు అరుణ్, తదితరులు ఉన్నారు

తల్లి మందలించిందని అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించిన మావల పోలీసులు



- ఫిర్యాదు అందిన మూడు గంటల్లోనే బాలుడి ఆచూకీ గుర్తింపు
- సీసీటీవీ కెమెరాల ఆధారంగా పట్టణమంతా గాలింపు చర్యలు
- వెంటనే మూడు బృందాలను ఏర్పాటు చేసి బాలుడి కోసం ప్రత్యేక అన్వేషణ
- మావల పోలీసుల త్వరిత స్పందనను అభినందించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్
- మావల సీఐ బి.డి. ప్రేమ్ కుమార్

సికె.న్యూస్. ప్రతినిధి..ఆదిలాబాద్ :వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ పట్టణంలోని షాద్నగర్ ప్రాంతానికి చెందిన సమరిన్ బేగం అనే మహిళకు ఐదుగురు సంతానం. నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో 11 సంవత్సరాల వయస్సు కలిగిన కుమారుడు అందరికంటే పెద్దవాడు. అతను నాలుగో తరగతి చదువుతున్నాడు. కాగా, నవంబర్ 2వ తేదీ ఉదయం పని నిమిత్తం బాలుడి తల్లి బయటకు వెళ్లిన సమయంలో అక్కతో జరిగిన గొడవ కారణంగా బాలుడిని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు ఉదయం సుమారు 7 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో షాద్నగర్ ప్రాంతంలో నిర్వహిస్తున్న పోలీసు మీకోసం కార్యక్రమంలో బాధితురాలు మావల పోలీసు సిబ్బందికి ఫిర్యాదు చేయగా, వెంటనే స్పందించిన మావల సీఐ బి.డి. ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ విస్తృతంగా అన్వేషించారు. పోలీసుల సమన్వయంతో కూడిన త్వరిత చర్యల ఫలితంగా ఫిర్యాదు అందిన మూడు గంటల్లోనే బాలుడి ఆచూకీ గుర్తించి, క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఈ ఘటనలో మావల పోలీసు సిబ్బంది తక్షణ స్పందన, సమన్వయంతో చేపట్టిన గాలింపు చర్యలు, చాకచక్యంగా బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన తీరును జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు. బాలలు అలిగి ఇంటి నుంచి వెళ్లిపోవడం వంటి సందర్భాల్లో తల్లిదండ్రులు ఆందోళన చెందకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదుపై పోలీసులు తక్షణమే స్పందిస్తారని జిల్లా పోలీసు శాఖ సూచించింది.

మహిళలు, బాలికల భద్రతకు షీ టీం నిరంతర నిఘా

- అక్టోబర్ నెలలో 114 ఫిర్యాదుల స్వీకరణ
- 102 ఈ-పెట్టి కేసులు, 6 ఎఫ్ఐఆర్‌ల నమోదు
- 17 మందికి కౌన్సెలింగ్.. ఒక బాల్యవివాహాన్ని అడ్డుకున్న షీ టీం
- 50 అవగాహన కార్యక్రమాలు, 39 గ్రామాల్లో పర్యటనలు
- 93 ప్రాంతాల్లో ప్రత్యేక పరిశీలనలు నిర్వహణ
- మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీసు అక్క ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్



సికె.న్యూస్. ప్రతినిధి..ఆదిలాబాద్ :ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు షీ టీం బృందాలు, పోలీస్ అక్క సిబ్బంది నిరంతరం కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. మహిళలు, విద్యార్థినులు ఎదుర్కొంటున్న వేధింపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తూ, బాధితుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. సోమవారం షీ టీం మరియు పోలీస్ అక్క సిబ్బంది చే జిల్లా ఎస్పీ నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. అక్టోబర్ నెలలో షీ టీం బృందాలకు మొత్తం 114 ఫిర్యాదులు అందగా, వాటిపై స్పందించి 102 ఈ-పెట్టి కేసులు, 6 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వేధింపులకు పాల్పడుతున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు, 17 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి తగిన సూచనలు చేశారు. వీరిలో 17 మంది మైనర్లు ఉండటం గమనార్హం. మహిళలు, విద్యార్థినులు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, షాపింగ్ ప్రాంతాలు తదితర ప్రదేశాల్లో షీ టీం బృందాలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాయి. నెలరోజుల వ్యవధిలో 93 ప్రాంతాల్లో ప్రత్యేక పరిశీలనలు నిర్వహించి, 39 గ్రామాలను సందర్శించి మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతూ, అక్టోబర్ నెలలో ఒక బాల్యవివాహాన్ని షీ టీం బృందం అడ్డుకుంది. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ, ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు, బాలికలు ఈవ్ టీజింగ్, వేధింపులు, అసభ్య ప్రవర్తన, బ్యాడ్ టచ్ వంటి ఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. సోషల్ మీడియా, ఇతర ఆన్‌లైన్ వేదికల ద్వారా వేధింపులకు గురైనా వెంటనే ఫిర్యాదు చేయాలని, బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతూ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా మహిళలు, విద్యార్థినులు, చిన్నారుల భద్రత, బాల్యవివాహాల నివారణ, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు తదితర అంశాలపై మొత్తం 50 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఇతర సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు షీ టీం బృందాలు నిరంతరం అందుబాటులో ఉంటాయని, ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే షీ టీం నంబర్ 8712659953 లేదా డయిల్ 112, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. పోలీస్ శాఖ మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన పి మౌనిక ఐపీఎస్, షీ టీం ఏఎస్ఐ సుశీల, హెడ్ కానిస్టేబుల్ వాణిశ్రీ, పోలీస్ అక్క సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పలమురుసు గ్రామానికి విద్యుత్ భద్రతలో మరో ముందడుగు!

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో నూతన ఏబీ స్విచ్ ప్రారంభం
- గ్రామ సర్పంచ్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో విద్యుత్ సౌకర్యాల మెరుగుదలకు చర్యలు



తప్పలమురుసు: గ్రామంలో విద్యుత్ సౌకర్యాలను మెరుగుపరిచే దిశగా నూతనంగా ఏర్పాటు చేసిన ఏబీ స్విచ్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో, గ్రామ సర్పంచ్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఈ ఏబీ స్విచ్ ప్రారంభంతో గ్రామ విద్యుత్ వ్యవస్థలో మరో ముందడుగు పడింది. గ్రామ ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యాలు అందించేందుకు చేపట్టిన ఈ పనులకు సహకరించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భీమేశ్, లైన్‌మెన్ రాజు, ఎంపీటీసీ గద్వాల తిమ్మప్ప, ఊరకుంట తిమ్మప్ప, మూడో వార్డు సభ్యుడు శేషంపల్లి బొప్పలయ్య, తొమ్మిదో వార్డు సభ్యుడు పుల్లయ్య, ఐదో వార్డు సభ్యుడు కర్రెప్ప, మండల బజారి, ముచ్చేనిపల్లి నరసింహులు, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదకు ఆర్థిక సాయం



గంగారం, నవంబర్ 2: మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం దుబ్బగూడెం గ్రామపంచాయతీకి చెందిన చాపల పాపక్క గత కొన్ని రోజులుగా నరాల వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న గంగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ముడిగ వీరభద్ర పోతయ్య గారు ఈరోజు వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించారు. మంత్రి సీతక్క గారి ఆదేశాల మేరకు, స్థానిక సర్పంచ్ ఇచ్చిన సమాచారంతో పార్టీ నాయకులతో కలిసి ఈరోజు దుబ్బగూడెం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందించడం జరిగింది. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పాపక్కకు అండగా ఉంటామని, వైద్య ఖర్చులకు ప్రభుత్వ పరంగా కూడా సహాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా సభ్యులు బండి వీరస్వామి, మాజీ జెడ్పీటీసీ ఈసం రమ సురేష్, ఉపాధ్యక్షులు గుమ్మడి ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గిరగాని ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి జనగాం కృష్ణస్వామి, స్థానిక సర్పంచ్ పూణే సంధ్య సందీప్, మర్రిగూడెం సర్పంచ్ మేడ స్వరూప సారయ్య, ఉప సర్పంచులు సువర్ణపాక దీపక్, సత్యనారాయణ, పార్టీ నాయకులు కల్తి శేఖర్ ,లిబండి సుధాకర్, ఆదినారాయణ,లిజనగాం సురేష్, ఇక సంతోష్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫాను దృశ్య ప్రజల అప్రమత్తంగా ఉండాలి జిల్లా కలెక్టర్.



అనకాపల్లి, సికె.న్యూస్... ప్రతినిధి.. మురసు తుఫాను దృశ్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రజలకు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ (ఐఏండి) తాజా నివేదిక ప్రకారం, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మురసు తుఫాను గురించి సోషల్ మీడియాలో చాలా వదంతులు ప్రచారంలో ఉన్నాయని, ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దని కలెక్టర్ కోరారు. జిల్లాలో ఎలాంటి తీవ్ర మైన లేదా మోస్తరు వర్షపాత హెచ్చరికలు లేవని, అక్కడక్కడా తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందే తప్ప, ఎక్కడా భారీ వర్షాల హెచ్చరికలు లేవని కలెక్టర్ తెలిపారు. లోతట్టు గ్రామాల ప్రజలు కాస్త అప్రమత్తంగా ఉండాలన్నారు.

వర్షాకాలంలో తీసుకోవాల్సిన సాధారణ ముందస్తు జాగ్రత్తలు (చెట్లు, విద్యుత్ పోల్స్ దగ్గరకు వెళ్లకుండా ఉండటం) పాటించాలని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. వాతావరణ శాఖ, జిల్లా యంత్రాంగం ఎప్పటి కప్పుడు జారీ చేసే హెచ్చరికలను గమనిస్తూ పాటించాలని కలెక్టర్ ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెంద వద్దని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి.

జిల్లా పరిషత్ సీఈవో సత్యనారాయణ.



అనకాపల్లి, సికె.న్యూస్... ప్రతినిధి.. జిల్లాలో జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణ సోమవారం ఉదయం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ తదితర వివరాలను తెలియజేశారు.

అనకాపల్లి, బుచ్చయ్యపేట, కసింకోట, మునగపాక, పరవాడ, సబ్బవరం మండలాలకు సంబంధించి ఏ. ఎం. ఏ. ఎల్. కాలేజ్ , కొత్తూరు విలేజ్, అనకాపల్లి నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చోడవరం మండలానికి సంబంధించి గవర్నమెంట్ హై స్కూల్, గంది గ్రామం, చోడవరం మండలం నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవరపల్లి, కె కోటపాడు మండలాలకు సంబంధించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం (బాయ్స్), తెనుగు పూడి దేవరపల్లి మండలం నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నక్కపల్లి మండలానికి సంబంధించి గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ నక్కపల్లి నందు, పాయకరావుపేట, ఎస్ రాయవరం మండలాలకు సంబంధించి జిల్లా పరిషత్ హై స్కూల్, నక్కపల్లి నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మాకవరపాలెం, నర్సీపట్నం, రోలుగుంట మండలాలకు సంబంధించి డాన్ బాస్కో స్కూల్, పెద్ద బొడ్డేపల్లి నందు, కోటవురట్ల, గొలుగొండ, నాతవరం, రావికమతం మండలాలకు సంబంధించి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నర్సీపట్నం నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వి. మాడుగుల, చీడికాడ మండలాలకు సంబంధించి సెంటెన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ , విమాడుగుల నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలకు సంబంధించి ఇండోర్ స్టేడియం యలమంచిలి నందు యలమంచిలి మండలానికి సంబంధించి ఎస్జిఏ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, యలమంచిలి నందురిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ తెలిపారు.

బాధితుల ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలి

- సమస్యలు పరిష్కారమైనప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది
- పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహణ
- జిల్లా వ్యాప్తంగా 34 ఫిర్యాదులను నేరుగా స్వీకరించిన జిల్లా ఎస్పీ
- సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి సమస్యల పరిష్కారానికి సూచనలు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్



సికె.న్యూస్... ప్రతినిధి..ఆదిలాబాద్ :బాధితుల ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 34 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి నేరుగా విన్నవించారు. ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ బాధితుల సమస్యలను స్వయంగా విని, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితుల సమస్యలను పరిష్కరించినప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం, విశ్వాసం మరింత పెరుగుతాయని తెలిపారు. ప్రజలు పోలీసుల ద్వారా పరిష్కరించదగిన సమస్యలపై నిర్భయంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని లేదా నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 8712659973 వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు లేని, గంజాయి మరియు మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను నిర్మించేందుకు యువత, ప్రజలు పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, సిబ్బంది వాణిశ్రీ, వామన్, సునీల్, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ లో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి.





- మండల స్థాయిలో, జిల్లా పరిషత్ లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలి.
- కౌంటింగ్ పూర్తయ్యేవరకు మోడల్ కోడ్ అమలు.
- ప్రతి రెండు గంటలకు పోలింగ్ సరళిపై నివేదిక ఇవ్వాలి.
- పోలింగ్ కు 48 గంటల ముందునుండి మద్యం దుకాణాలు బంద్.
- జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్.

విశాఖపట్నం, సికె.న్యూస్... ప్రతినిధి..జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసి, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను అతిక్రమించ కుండా జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం లో జె. సి జి. విద్యాధరి తో కలిసి ఆర్డీఓలు, రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీఓలు, నోడల్ అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5 న పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల వద్ద దారులను చూపుతూ సైనేజెస్ పెట్టాలని, ప్రతి మండలం లో ఒక మాడల్ పోలింగ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు.

పోలింగ్ సరళిని పర్యవేక్షించడానికి ప్రతి మండల స్థాయి లోనూ, అలాగే జిల్లా పరిషత్ లో కూడా కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూమ్ లో పూర్తి స్థాయి లో అవసరమగు సిబ్బందిని ఏర్పాటు చేసి వారికి వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ సరళికి సంబంధించిన వివరాలను నిర్దేశిత సమయానికి కంట్రోల్ రూమ్‌కు అందించాలని తెలిపారు. తుది పోలింగ్ శాతం తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. పోలింగ్ మెటీరీయల్ సక్రమంగా పంపిణీ కావాలని, పబ్లిక్ అడ్రసు సిస్టమ్ లను ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్ వద్ద, పోలింగ్ బూత్ ల వద్ద సక్రమంగా బారికేడింగ్ చేయాలని, పోలింగ్ కు, కౌంటింగ్ కు నియమించిన సిబ్బందికి శిక్షణలు పూర్తి చేయాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్లు, స్టేషనరీ, ఇతర ఎన్నికల సామగ్రిని ముందుగానే తనిఖీ చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. పంపిణీ కేంద్రాల వద్ద హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ఓటర్ స్లిప్పులను శత శాతం ముందుగానే ఇంటింటికీ పంపిణీ చేయాలని తెలిపారు. పోలింగ్ కు 48 గంటల ముందే ప్రచారాన్ని నిలిపివేయాలని తెలిపారు. పోస్టల్ బాలెట్ల పంపిణీ, స్వీకరణ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ, రూట్ వెరిఫికేషన్, రవాణా ఏర్పాట్లు పక్కాగా చేయాలని, పోలింగ్ సిబ్బందికి చక్కటి వసతి, భోజన సౌకర్యాలు , తాగునీరు, అల్పాహారం ఏర్పాటు చేసి వారి పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఆర్డీఓలు కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని, ఎంపిడిఓలు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తమ పరిధిలో ఎన్నికల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో, కౌంటింగ్ కేంద్రాల్లో, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. పోలింగ్ కు 48 గంటల ముందు నుండి మద్యం దూకణాలను మూసివేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి, నిబంధనల ఉల్లంఘనకు తావులేకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి జవాబుదారీతనంతో నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, ఇద్దరు ఆర్. డి. ఓ లు సందీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, ఎన్నికల అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా నిర్వహించాలి.







- కౌంటింగ్ విధివిధానాలు, ఎన్నికల నిబంధనల పై అధికారులకు కమిషనర్ దిశానిర్దేశం.
- రిటర్నింగ్ అధికారులు, జోనల్ కమిషనర్లు, జోనల్ ప్రత్యేక అధికారులు సమన్వయంతో పనిచేయాలి.
- కౌంటింగ్ సిబ్బంది సంయమనం, ఓర్పు, అప్రమత్తతతో విధులు నిర్వహించాలి.
- కౌంటింగ్ హ్యాండ్ బుక్ లోని మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి.
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.

విశాఖపట్నం సికె.న్యూస్... ప్రతినిధి..జీవీఎంసీ రెండవ సాధారణ ఎన్నికలు 2026 కు సంబంధించి నవంబర్ 3 వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన గాజువాక జోన్ కౌంటింగ్ కేంద్రం ఆవరణలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పై రిటర్నింగ్ అధికారులు, జోనల్ కమిషనర్లు, జోనల్ ప్రత్యేక అధికారులు, జీవీఎంసీ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ ప్రక్రియలో అనుసరించాల్సిన విధి విధానాలు, ఎన్నికల నిబంధనలు, అధికారులు మరియు సిబ్బంది నిర్వర్తించాల్సిన బాధ్యతలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను కమిషనర్ క్షుణ్ణంగా వివరించారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ప్రతి దశలోనూ సంయమనం, ఓర్పు, అప్రమత్తత పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి జోన్ కు కేటాయించిన కౌంటింగ్ కేంద్రాలను సంబంధిత అధికారులు, సిబ్బంది ముందుగానే సందర్శించి, అక్కడి ఏర్పాట్లు, తమకు కేటాయించిన విధులు, బాధ్యతల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కౌంటింగ్ ప్రారంభానికి ముందే అవసర మైన అన్ని ఏర్పాట్లు, సౌకర్యాలు సమకూర్చుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అధికారులకు అందించిన హ్యాండ్ బుక్ ను పూర్తిగా పరిశీలించి, అందులో పొందుపరిచిన మార్గదర్శకాలు, సూచనలు, విధివిధానాలను తప్పనిసరిగా అనుసరిస్తూ విధులు నిర్వహించాలని కమిషనర్ దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు.